PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 208 | విజయవాడ, ఆదివారం 3 మార్చి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 3 March 2024 | Rs

కేంద్రానికి పిఎస్‌యుల బంపర్ డివిడెండ్

- అంచనాలకు మించి అందజేత
- 11 మాసాల్లో రూ.51,556 కోట్లు



లోపలి పేజీలో..

ఆదివారం అనుబంధం 'స్నేహ' అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసాలు, కథలు, కథనాలతో 'ధీర'గా అందిస్తున్నాం.

- సంపాదకులు





దాచేపల్లి సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

5న బిసి డిక్లరేషన్

- పవన్‌తో విభేదాల సృష్టికి జగన్ యత్నం
- టిడిపి అధినేత చంద్రబాబు
- ఎంపిలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు చేరిక

ప్రజాశక్తి- నెల్లూరు, గుంటూరు జిల్లా ప్రతినిధులు

ఈ నెల ఐదున తమ పార్టీ తరుపున బిసి డిక్లరేషన్ ప్రకటిస్తామని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. టిడిపి, జనసేన పార్టీలో జగన్ తన కోవర్టులను పెట్టి పవన్ కల్యాణ్‌కు, తనకు మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని ఎత్తుగడలు వేసినా తమ మధ్య విభేదాలు సృష్టించలేరన్నారు. జగన్ రాష్ట్రమంతా తిరుగుతూ సిద్ధమా? అని అంటున్నారని, ఇంటికి వెళ్లడానికి, జైలుకు వెళ్లడానికి ఆయన సిద్ధంగా ఉన్నారా? చంద్రబాబు ప్రశ్నించారు. నెల్లూరులో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన భార్య ప్రశాంతిరెడ్డి, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లిలో నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు వైసిపి నుంచి తమ అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని టిడిపిలోకి చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోనూ, రా... కదిలిరా కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కేశానుపల్లిలోనూ శనివారం జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. 'నా రాజకీయ జీవితలో ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేశారు. ఇంటికి లేదా జైలుకు వెళ్లడానికి జగన్ సిద్ధంగా ఉండాలి. చెల్లికి కూడా న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి న్యాయం చేస్తారా? అని దుయ్యబట్టారు. జగన్ మోసాలు భరించేలేక ఇప్పటికే ఆరుగురు ఎంపిలు, పది మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీని విడిచి పెట్టారని వివరించారు. వైసిపి విధానాలు నచ్చక రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మారుతున్నారన్నారు. ఐదేళ్ల క్రితం జరిగిన వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరో జగన్ స్పష్టంగా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. హత్యలు చేసే వారు రాజకీయాలకు పనికిరారన్నారు. తన తండ్రిని చంపిన వైసిపికి ఓటు వేయవద్దని వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత చేసిన విజ్ఞప్తిని ప్రజలు మన్నించాలని కోరారు. మరో 40 రోజుల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పల్నాడు జిల్లాలో వైసిపి నరహంతక ముఠాలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. గత ఐదేళ్లలో 30 మంది టిడిపి కార్యకర్తలను, నాయకులను మిగతా 2లో

వణికిస్తున్న జిఎస్‌టి సర్వే

- కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు
- పన్ను పరిధిలోకి మరిన్ని సంస్థలను తేవడమే లక్ష్యం
- కరెంటు కనెక్షన్ ఉన్న పాన్ షాపులను కూడా వదలని వైనం
- ఇళ్లలో తినుబండారాలు చేసి అమ్మినా నమోదు చేయాల్సిందే

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక సర్వే వ్యాపార, వాణిజ్య వర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. జిఎస్‌టి పరిధిలోకి మరిన్ని సంస్థలను తేవడమే లక్ష్యంగా ఈ సర్వే సాగుతోందన్న సమాచారమే దీనికి కారణం. తయారీ, సేవా, వాణిజ్య విభాగాల్లోన్ని అన్ని రకాల సంస్థలను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావడం ద్వారా ఆ పన్ను వసూళ్లను గణనీయంగా పెంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ప్రస్తుతం జిఎస్‌టి నిర్ధారణకు కీలకంగా ఉన్న ఉదయం పోర్టల్‌లో దేశ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివిధ సంస్థలు నమోదు కాలేదు. పెద్ద సంఖ్యలో స్టార్టప్‌లు ఈ పోర్టల్‌లో నమోదుకాకుండానే నడుస్తున్నాయి. దీంతో ఈ సంస్థల నుండి జిఎస్‌టి వసూళ్లు కావడం లేదు.

ఈ నేపథ్యంలో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన సంస్థల డిజిటలీకరణ ప్రాజెక్టులో భాగంగా ఈ సర్వే చేపట్టారు. రైజింగ్ అండ్ అక్సెలరేటింగ్ ఎంఎస్ఎంఇ ప్రొడక్టవిటీ (ఆర్ఎఎంపి)లో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోసం 10.70 కోట్ల రూపాయలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో ఇలా...

ఆంధ్రప్రదేశ్‌లో 33.78 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాటిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉదయం పోర్టల్‌లో 20 లక్షల వరకు రిజిస్టర్ కాలేదని తెలుసుకుంది. దీంతో రిజిస్టర్ కాకుండా ఉన్న సంస్థల వివరాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. దీంతో 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర పరిశ్రమ సర్వే పేరుతో గత నెల 23న జిఒ నంబరు 24ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మరోవైపు వివిధ శాఖల నుండి సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు పొందిన వారి వివరాలు, జిఎస్‌టి చెల్లిస్తున్న పరిశ్రమలు, సంస్థలు, ఫ్యాక్టరీస్ ఇన్సపెక్టర్ నుంచి అనుమతి పొందిన కర్మాగారాల వివరాలు సేకరించారు. వాటి నుంచి వచ్చిన వివరాలతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉదయం పోర్టల్ వివరాలను సరిపోల్చి చూస్తున్నారు.



చిన్న తరహా పరిశ్రమలో వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

సర్వేకు కొత్త యాప్

పరిశ్రమల సమగ్ర సర్వే కోసం పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వార్డు ఎమినిటీస్ అసిస్టెంట్లను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటోంది. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు వీరికి ఎంపిడిఒ, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎపిఐఐసి, తదితర శాఖల అధికారులు సహకారం అందించనున్నారు. సర్వే వివరాల నమోదుకు ప్రభుత్వం 'ఎంఎస్ఎంఇ సర్వే అండ్ సపోర్టు' పేరుతో ఒక కొత్త యాప్‌ను రూపొందించింది. సర్వే సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో అన్ని రకాల వ్యాపారాలు, తయారీ, సేవా రంగం, రిటైల్ వ్యాపారాల వివరాలు సేకరించనున్నారు. విద్యుత్ కనెక్షన్ల సమాచారం ఆధారంగా పాన్ షాపుల్ని కూడా వదలడం లేదు. ఇంట్లో తినుబండారాలు తయారు చేసి అమ్మినా వాటి వివరాలనూ నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల ఒకటవ తేదిన ప్రారంభమైన ఈ సర్వేను 15 నుండి 20 రోజుల్లో పూర్తి చేయాలన్నది లక్ష్యం.

ఇదీ ప్రశ్నావళి

సర్వే కోసం ప్రశ్నావళిని ఏడు భాగాలుగా విడదీశారు. అందులో ఎంటర్ ప్రైజెస్ వివరాలు ఇందులో యజమాని పూర్తి వివరాలను పొందుపరుస్తున్నారు. పరిశ్రమ లేక సంస్థలో తయారు చేస్తున్న ఉత్పత్తి, పెట్టుబడుల సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. పరిశ్రమలో కల్పిస్తున్న ఉద్యోగాలు, రుణ సహాయం వివరాలు, మార్కెటింగ్ వివరాలను పొందుపర్చనున్నారు. పరిశ్రమ, సంస్థకు సంబంధించిన భూమి వివరాలనూ సేకరిస్తున్నారు. జిఎస్‌టి చెల్లిస్తున్నారా? లేదా? చెల్లిస్తే నంబరును నమోదు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ సర్వే దేనికి దారి తీస్తోందనని అంతా భయపడుతున్నారు.

వారణాసి నుంచే మళ్లీ మోడీ

195 మందితో బిజెపి తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ మళ్లీ వారణాసి నుండే తిరిగి పోటీ చేయనున్నారు. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీతో సహా 34మంది కేంద్ర మంత్రులతో కూడిన 195మంది అభ్యర్థుల తొలి జాబితాను బిజెపి శనివారం నాడిక్కడ విడుదలజేసింది. ఈసారి కూడా కేంద్రంలో తామే అధికారంలోకి వస్తామని బిజెపి నేత వినోద్ తావ్డే జోస్యం చెప్పారు. యుపిలో 51 , పశ్చిమ బెంగాల్‌లో 20, ఢిల్లీలో ఐదు స్థానాలకు ఈ తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే జాబితాను విడుదల చేస్తూ, మూడోసారి బిజెపినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ జాబితాలో 28మంది మహిళలు, 47మంది యువ నేతలు వున్నారని చెప్పారు. యుపిలో 51 సీట్లకు, పశ్చిమ బెంగాల్‌లో 20, ఢిల్లీలో ఐదు స్థానాలకు అభ్యర్థులను ఈ జాబితాలో ప్రకటించారు. మిగిలిన అభ్యర్థుల పేర్లపై చర్చలు జరిపేందుకు వచ్చే వారం బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది.

తెలంగాణలో తొమ్మిది మంది పేర్లు ఖరారు

మొదటి జాబితాలో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. 2019లో నలుగురు గెలువగా, తొలి జాబితాలో ముగ్గురు సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి అర్వింద్ పేర్లను అధిష్టానం నిర్ణయించింది. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపి సోయం బాపురావు పేరు పెండింగ్ లో పెట్టింది. చేవెళ్ల నుంచి మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, భువనగిరి నుంచి నుంచి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్, హైదరాబాద్ నుంచి సినీనటి మాధవీ లతలకు అవకాశం కల్పించింది. మల్కాజ్ గిరి స్థానాన్ని ఈటల రాజేందర్‌కు కేటాయించింది. ఇటీవల పార్టీలో చేరిన బిఆర్ఎస్ ఎంపిలకు బిజెపి సీట్లు కేటాయించింది. నాగర్ కర్నూల్ సీటును సిట్టింగ్ ఎంపి పోతుగంటి రాములు కుమారుడికి ఇచ్చింది. జహీరాబాద్ నుంచి సిట్టింగ్ ఎంపి బిబి పాటిల్‌కు ప్రాధాన్యత ఇచ్చింది.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజస్థాన్‌లోని కోటా నుంచి, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విదిశా నుంచి పోటీ చేయనున్నారు. తొలి జాబితాలో కేంద్ర మంత్రులు మన్సుఖ్ మాండవీయ, జితేంద్రసింగ్, శర్వానంద్ సోనోవాల్, గజేంద్ర షెకావత్, భూపేందర్ యాదవ్, జి.కిషన్‌రెడ్డి, కిరణ్ రిజిజు, జ్యోతిరాదిత్య సింధియా, రాజీవ్ చంద్రశేఖర్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, అర్జున్ ముండా ఉన్నారు. లఖింపూర్ ఖేరీలో రైతులపై మారణకాండ కేసులో ప్రధాన నిందితుడు కేంద్ర సహాయ మంత్రి అజయ్‌మిశ్రా తేనికి మళ్లీ టికెట్ కేటాయించారు. సినీ నటి హేమమాలిని, రవికిషన్, మహేష్‌శర్మ, ఎస్‌పిఎస్ బఘేల్ , సాక్షి మహరాజ్ తదితరులు ఈ తొలి జాబితాలో చోటు దక్కించుకున్నవారిలో ఉన్నారు. ఈ జాబితాలో ప్రధాన మార్పు ఏమిటంటే ఢిల్లీ నుంచి రమేష్ బిధూరి, పర్వేష్ వర్మ, మీనాక్షి లేఖి, హర్షవర్ధన్‌లకు ఈ సారి టికెట్ నిరాకరించారు. అలాగే భోపాల్ నుంచి సాధ్వి ప్రజ్ఞా సింగ్ టాకూర్‌ను డ్రాప్ చేశారు.

10న వైసిపి మేనిఫెస్టో

- సిద్ధం సభలో విడుదల చేస్తామన్న విజయసాయిరెడ్డి

లోపలి పేజీలో..



శ్రీవారి లడ్డూ ధర తగ్గించలేం

- ఫిబ్రవరి హుండీ ఆదాయం రూ.111 కోట్లు
- డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో ఎవి ధర్మారెడ్డి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో
వెనుకబాటు

- భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ కన్నా అట్టడుగున భారత్

న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా 2023లో పనితీరు కనబరిచిన 166 దేశాల్లో భారత్ 112వ స్థానంలో వుంది. మేథో సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) ప్రచురించిన 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ ఎన్విరాన్‌మెంట్ 2024 రిపోర్ట్' ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్ ఇచ్చారు. ఇందుకు అవసరమైన డేటాను ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి నివేదిక 2023 నుండి తీసుకున్నారు.

2022లో భారత్ 121వ స్థానంలో వుంది. భూటాన్ (61వ స్థానంలో వుంది. దక్షిణాసియాలోనే ఉత్తమ స్థానం), మాల్దీవులు (68), శ్రీలంక (83), నేపాల్ (99), బంగ్లాదేశ్ (101) కన్నా భారత్ ఇంకా వెనుకబడే వుంది. పాకిస్తాన్ 128వ స్థానంలో వుండగా, ఆఫ్ఘనిస్తాన్ 158వ స్థానంతో సరిపెట్టుకుంది. "సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో అనేక దక్షిణాసియా దేశాల కన్నా భారత్ వెనుకబడి వుంది. విస్తృత సామాజిక జీవన ప్రమాణాలతో కూడిన ఎజెండాలతో ముడిపడిన




ప్రామాణికాలను భారత ఆర్థిక క్రమం సరిగా అందుకోలేకపోయినట్లు కనిపిస్తోంది." అని ఐక్యరాజ్య సమితి మాజీ అండర్ సెక్రటరీ జనరల్ నితిన్ దేశాయ్ మీడియాతో వ్యాఖ్యానించారు. 2023లో 63.45 శాతం స్కోర్ సాధించింది. 'అసమానతలను తగ్గించడం', జీవ వైవిధ్యతను పరిరక్షించడానికి సంబంధించిన 'భూమిపై జీవనం' వంటి నిర్దిష్ట ప్రమాణాలపై భారత్ పనితీరు దిగజారింది. ఈ విషయాల్లో భారత్ పట్టికలో అత్యంత అడుగున నిలిచింది. సుస్థిరమైన అభివృద్ధి నమోదు చేసిన నగరాలు, సమానత్వం, పరిశుద్ధమైన నీరు, పారిశుధ్యం, శాంతి, న్యాయం, బలమైన సంస్థలు వంటి పలు రంగాల్లో కూడా భారత్ పేలవమైన పనితీరును ప్రదర్శించింది.

మహాబలిపురం బీచ్‌లో విషాదం

- చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థి మృతి
- మరో ఇద్దరు గల్లంతు



విజయ్



మౌనిష్



ప్రభు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, పలమనేరు

తమిళనాడు రాష్ట్రం మహాబలిపురం బీచ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చిత్తూరు జిల్లాకు చెందిన ఒక విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వీరంతా పలమనేరు ఎస్‌విసిఆర్ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నారు.

తోటి విద్యార్థుల కథనం ప్రకారం... ఎస్‌విసిఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించడంతో సెలవు దినంగా ప్రకటించారు. జాబ్‌మేళాకు హాజరైన వారిలో 18 మంది ఒక బృందంగా విహారయాత్ర కోసం తమిళనాడులోని మహాబలిపురానికి వెళ్లారు. వీరిలో పది మంది విద్యార్థులు, ఎనిమిది విద్యార్థినులు ఉన్నారు. శనివారం ఉదయం మహాబలిపురం సముద్రపు బీచ్‌లో సరదాగా స్నానం చేస్తుండగా అలల ఉధృతికి ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోయారు. వారిలో బంగారుపాళ్యం మండలం నల్లగంపల్లి పంచాయతీ కెసి కండ్రిక గ్రామానికి చెందిన విజయ్ (19), మౌనిష్, సదుం మండలం రెడ్డివారిపల్లి పంచాయతీ పెడకంటి వారిపల్లి గ్రామానికి చెందిన ప్రభు ఉన్నారు. విజయ్ మృతదేహం లభ్యమైంది. మిగిలిన ఇద్దరు కోసం గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. తమిళనాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయండి

- బెఫీ ధర్నాలో వక్తల డిమాండ్
- భర్తీకాని లక్ష పోస్టులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బ్యాంకుల్లో ఉన్న క్లరికల్, ఇతర ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బెఫీ) పిలుపు మేరకు శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో ప్రభుత్వరంగ, గ్రామీణ బ్యాంకులకు చెందిన వందలాది మంది ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ప్రారంభించిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పెనుభారం పడుతోందని తెలిపారు. 2010 నుండి 2021 వరకు బ్యాంకుల్లో పనిచేస్తున్న క్లరికల్ ఉద్యోగుల సంఖ్య 3,87,831 నుండి 2,77,608కి దిగజారిందని అన్నారు. దాదాపు లక్ష పోస్టులు ఖాళీ అయ్యాయని పేర్కొన్నారు. సబ్‌స్టాఫ్ క్యాడర్లోనూ 20 ఏళ్లుగా నియమాకాలు జరగడం లేదని పేర్కొన్నారు. ఇదే కాలంలో బ్యాంకుల వ్యాపారం రూ.76,78,617 కోట్ల నుండి రూ.152,06,532 కోట్ల రూపాయలకు పెరిగిందని పేర్కొన్నారు. పదేళ్లలో రూ.76 లక్షల కోట్లకు పెరిగిందని వివరించారు. పెరిగిన వ్యాపారానికి తగిన విధంగా నియామకాలు జరగకపోవడంతో ఖాతాదారులకు అందాల్సిన సేవా ప్రమాణాలు దెబ్బతిన్నాయని, ఒకపక్క దేశంలోని విద్యాధికుల్లో నిరుద్యోగం పెరిగిపోతూ ఉంటే కీలకమైన బ్యాంకింగ్ రంగంలో పెరిగిన అవసరాలకు అనుగుణంగా రిక్రూట్‌మెంట్ చేపట్టకుండా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. బెఫీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ తక్షణమే బ్యాంకుల్లో అన్ని క్యాడర్లలో నియామకాలు చేపట్టాలని, టెంపరరీ, క్యాజువల్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంటు చేయాలని, ఔట్‌సోర్సింగ్ నిలిపేయాలని, బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రయత్నాలు నిలిపేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో బ్యాంకు ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బెఫీ ఆలిండియా జనరల్ కౌన్సిల్ సభ్యులు మూర్తి మాట్లాడుతూ పోరాటాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. బెపి రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, ఉద్యోగ సంఘాల నాయకులు కళాధర్, సిఐటియు సహాయ కార్యదర్శి ముజఫర్, ఎం.వి.సుధాకర్, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు కెఎన్‌వి ప్రసాదు, కెవిపిఎస్ నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, మెడికల్ రిప్స్ నాయకులు యు.వి.కృష్ణయ్య, ఓబిసి నాయకులు హరిప్రసాదు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న నర్సింగరావు

దేశ అవసరాలు తీర్చేందుకు పెట్రో వర్సిటీ

- ప్రధాని మోడీ
- నిర్మాణాలకు వర్చువల్‌గా భూమిపూజ

లోపలి పేజీలో..

ప్రభుత్వంలో 'ప్రైవేటు' నిపుణులు !

- లేటరల్ ఎంట్రీ పేరిట 25 మంది నియామకం
- కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- విధాన నిర్ణయాలలో వారిదే కీలక పాత్ర

కౌలు రైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖి

- సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి
- రాజకీయ పార్టీలకు ఎపి కౌలు రైతుల సంఘం వినతి




వి.శ్రీనివాసరావు, షర్మిలకు వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతుల సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. పంట సాగు హక్కు చట్టాన్ని సవరిస్తామని, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా సిసిఆర్‌సి కార్డులు ఇస్తామని, కౌలు రైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని ప్రకటించాలని కోరింది. ఈ మేరకు కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు నేతృత్వంలోని ప్రతినిదుల బృందం పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలుగుసేన రాష్ట్ర అధ్యక్షులు పి.సత్యారెడ్డి, టిడిపి పార్టీ కార్యాలయం అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, జై భారత్ నేషనల్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావుకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షలమంది కౌలు రైతులు ఉన్నారని, ప్రభుత్వాలు నాలుగైదు లక్షలకు మించి కార్డులు ఇవ్వడం లేదని ఫలితంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భూమిలేని ఓసి కౌలు రైతులకు కూడా రైతు భరోసాని అమలుజరపాలని, కౌలు రైతులందరికీ ఒకసారి రుణమాఫీ చేయాలని, ప్రతిపేద కౌలురైతుకి నెలకు రూ.5వేలు పెన్షన్ అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సాయం 10 ఎకరాల వరకు ఎకరానికి రూ.10వేలు ఇవ్వాలని, సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతులను గుర్తించి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి పరిహారం అందజేయాలని, దేవాలయ భూములు సాగు చేస్తున్న వారందరికీ సిసిఆర్‌సి కార్డులు, బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పంటల బీమ పరిహారం ఇవాల్వని,నష్టపరిహారం ఇవ్వాలని ఆయన రాజకీయ పార్టీలను కోరారు. కౌలు గుర్తింపు కార్డు రాకపోతే రైతు భరోసా, పంటల బీమా, పంటల నష్టపరిహారం, చివరికి ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఎక్స్‌గ్రేషియో కూడా అందడం లేదన్నారు. రాజకీయ పార్టీలను కలిసిన బృందంలో కృష్ణా, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు పి.రంగారావు, బి.శ్రీనివాసరావు, చనుమోలు సైదులు ఉన్నారు.

హైదరాబాద్ ఇంకో 10 ఏళ్ళు ఉమ్మడి రాజధాని చేయాలి

- ఆస్తులు, అప్పులు, సంస్థల విభజన పూర్తి కాలేదు
- కేంద్ర విఫలం
- హైకోర్టులో పిల్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

హైదరాబాద్‌ను మరో పదేళ్ల ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ మేరకు చట్టం రూపొందించేలా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శిని ఆదేశించాలని పిల్లో పిటిషనర్ కోరారు. హైదరాబాదు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లకు ఉమ్మడి రాజధానిగా పదేళ్ల నిర్ణయిస్తూ పెట్టిన గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగుస్తుంది. విభజన చట్టం-2014 ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఆస్తులు, అప్పులు, తొమ్మిదో షెడ్యూల్లో పేర్కొన్న వివిధ కంపెనీలు, కార్పొరేషన్ల విభజన ప్రక్రియ పూర్తి కాలేదు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం మరో పదేళ్ల హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా చేసేలా చట్ట రూపకల్పనకు ఉత్తర్వులు ఇవ్వాలని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన 'ప్రజా సంక్షేమ సేవా సంఘం' కార్యదర్శి పొదిలి అనీల్ కుమార్ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రతివాదులుగా కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శులను చేశారు.

విజయసాయికి, అయోధ్యకు రీజనల్ బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు చూసుందుకు వైసిపి రీజనల్ కోఆర్డినేటర్లను నియమించింది. వైసిపి అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధికి వి.విజయసాయిరెడ్డిని రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమించారు. విజయవాడ, మచిలీపట్నం,బాపట్ల, గుంటూరు, నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల బాధ్యత ఎ. అయోధ్యరామిరెడ్డికి అప్పగించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటకు చెందిన పుల్లంశెట్టి నాగరాజు కుమారుడు బన్నీ (17) పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.



శుక్రవారం తొలిపరీక్ష రాసిన అనంతరం ఇంట్లో టివి, సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బన్నీ.. తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని, ప్రయోజకుడిని అయి వస్తానని లెటర్ రాసి వెళ్లిపోయారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సాయంకాలం కొండమోడు వద్ద గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే గూడ్స్ రైలు కింద పడి బన్నీ ఆత్మహత్య చేసుకున్నారు. కొండమోడు వద్ద విద్యార్థి మృతదేహం లభ్యమైనట్లు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో తల్లిదండ్రులు గుర్తించి, మృతదేహం తమ కుమారుడిదేనని గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

నీళ్లు అడిగితే చంపేస్తారా?

- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాచర్ల నియోజకవర్గం మల్లవరంలో ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన బాణావత్ సామునిబాయి ట్యాంకర్ దగ్గర నీళు పట్టుకునేందుకు వెళ్తే ప్రతిపక్ష పార్టీల వాళ్లు పట్టుకోరాదంటూ అడ్డుపడి, చివరికి ట్రాక్టర్‌తో ఢీ కొట్టి చంపిన ఘటన తనను కలచి వేసిందని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి వాళ్లే నీళ్లు తాగాలి, గాలి పీల్చాలని జీఓ ఇవ్వడం ఒక్కటే మిగిలి ఉందని పంచ భూతాలకు రంగులు పులిమే దుర్మార్గం రాజ్యమేలుతుందన్నారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు.

నిర్వాసితులను వెలిగొండలో ముంచుతారా?

- సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రశ్న
- అసంపూర్తి ప్రాజెక్టు ప్రారంభం ఎన్నికల స్టంటే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎనిమిది వేల కుటుంబాలకు పునరావాసం ఇవ్వకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పూర్తికాలేదని, వదలడానికి శ్రీశైలంలో నీళ్లులేవని, ఇది ఎన్నికల స్టంటు తప్ప మరొకటి కాదని అన్నారు. ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల ప్రజలను మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రకాశం జిల్లా ప్రజల కలల పంటగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు గత 40 సంతవ్సరాలుగా సాగుతూనే ఉందని, పదేపదే గడువులు పెట్టినా పూర్తిచేయని పాపం గత తెలుగుదేశం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలదేనని విమర్శించారు. జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా ప్రాజెక్టు పూర్తయిందని ఊరిస్తూనే ఉందని, నిధులు ఇవ్వకపోవడం, పునరావాసం పూర్తి చేయకపోవడం వల్ల ఇది దీర్ఘకాలం పెండింగ్‌లో ఉందని తెలిపారు. జిల్లా ప్రజలు నిత్యం కరువువాత పడుతూనే ఉన్నారని, వలసలు పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఎన్నికలప్పుడు మాయమాటలు చెప్పి పాలకులు తప్పించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా పూర్తిస్థాయి నిధులు కేటాయించి వచ్చే ఖరీఫ్ నాటికి ప్రజలకు నీళ్లు అందబాటులోకి తీసుకురావాలని, ఈలోపు పునరావాసం పూర్తిచేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తరుపున డిమాండు చేశారు.

బిల్లుల కోసం ఒత్తిడి

- రంగంలోకి దిగుతున్న 'పెద్దలు'
- చేతులెత్తేస్తున్న ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికలు సమీపిస్తుండటంతో పెండిగ్ బిల్లులను చెల్లించాలన్న ఒత్తిడి ఆర్థికశాఖపై పెరుగుతోంది. పెద్ద సంఖ్యలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు ప్రభుత్వంలోని పెద్దలను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో వారి నుండి ఆర్థికశాఖకు సిఫార్సు లేఖలు అందుతున్నాయి. కొందరు రాతపూర్వకంగా అడుగుతుంటే, మరికొందరు మౌఖికంగా చెబుతున్నారు. రాష్ట్ర ఖజానా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో బిల్లుల చెల్లింపులు సక్రమంగా సాగడం లేదు. కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, వ్యక్తిగత, సంస్థలు, ప్రభుత్వ శాఖల వంటి వాటికి పెద్ద ఎత్తున బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి మొత్తం లక్ష కోట్ల కన్నా ఎక్కువగానే ఉంటుందన్నది ఒక అంచనా. ఇంత భారీ స్థాయిలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక శాఖ చేతులెత్తేస్తోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ల నుండి ఒత్తిడి పెరుగుతోంది. కొందరు నేరుగా అధికారులతో మాట్లాడుతుంటే, మరికొందరుమంత్రులు, శాసనసభ్యులు, అధికార పార్టీ సీనియర్లు వంటి వారిని ఆశ్రయిస్తునారు. దీంతొ వారు బిల్లులు పొందాల్సిన వారి పరిస్థితిని వివరిస్తూ లేఖలు రాస్తున్నారు. అయితే చివరిలో మాత్రం నిబంధనల మేరకు చెల్లించాలంటూ కొసమెరుపు ఇస్తున్నారు. కొంతమంది అయితే లేఖకు అదనంగా ఆర్థికశాఖ అధికారులకు ఫోన్ కూడా చేసి చెబుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేంతవరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు అంటున్నారు.

చురుగ్గా కన్వీనియెన్స్‌డీడ్ పట్టాల పంపిణీ

- నేటి వరకు 14,70,149 రిజిస్ట్రేషన్లు పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నవ రత్నాలు -పేదలందరికీ ఇళ్ల పథకం కింద పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు కన్వీనియెన్స్‌డీడ్ (ఇంటి స్థలాల బదలాయింపు) ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల ఇంటి పట్టాలకు బదలాయింపు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. నేటి వరకు 26 జిల్లాల్లో 14,70,149 మందికి సంబంధించిన ఇంటి స్థలాల బదలాయింపు ప్రక్రియను పూర్తి చేసింది. ప్రభుత్వం ఇందు కోసం పట్టాదారునికి భారంగా మారకుండా ఉండేందుకు ఒక్కో దస్తావేజుకు చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ రూ.4,840లు, రిజిస్ట్రేషన్ చార్జీలు రూ.605లు , యూజర్ చార్జీలు రూ.500లు కల్పిూలిపి రూ.5,945లను ప్రభుత్వం మినహాయింపు నిచ్చింది. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద జీఓ ఎంఎస్ నెంబరు 391 రెవిన్యూ ల్యాండ్స్ తేదీ 24.12.2020, 25.12.2020 తేదీన కేటాయించబడిన ఇంటి స్థలాలకు (10 సంవత్సరాల తర్వాత) 25.12.2030 నాటికి ఎపి అసైన్డ్ ల్యాండ్స్(ప్రొహిబిషన్‌ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) అమెండ్ మెంట్ యాక్ట్ 35 ఆఫ్ 2021 ప్రకారం సంపూర్ణ శాశ్వత హక్కులను ప్రభుత్వం కల్పిస్తోంది.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ విధుల బహిష్కరణ

- 13 జిల్లాల న్యాయవాద సంఘాల ఏకగ్రీవ తీర్మానం
- భూ హక్కు చట్టం రద్దు చేసే వరకూ పోరాటం



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న బార్ ప్రెసిడెంట్ కెవికె.సురేష్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు చట్టం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని, ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని 13 జిల్లాల ఉమ్మడి న్యాయవాద సంఘాలు స్పష్టం చేశాయి. భూ హక్కు చట్టం వల్ల కలిగే దుష్పరిణామాలపై గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవికె.సురేష్ అధ్యక్షతన రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులతో శనివారం గుంటూరులో విస్తృత సమావేశం నిర్వహించారు. యాజమాన్య హక్కు అనేది రాజ్యాంగం ద్వారా కల్పించబడిందని, రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం ద్వారా ప్రజల నుంచి ఆ హక్కును లాక్కోవాలని చూడటం దుర్మార్గమైన చర్యగా వక్తలు నిర్ణయించారు. ఈ చట్టం ద్వారా బలవంతులకే ఆస్తి చెందుతుందని, సామాన్యులు ఆస్తులు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. యాజమాన్య హక్కు నిర్ధారణను రెవెన్యూ అధికారులకు కట్టబెట్టటం విడ్డూరమని, అధికారపక్షం చెప్పు చేతల్లో నడిచే రెవెన్యూ అధికారుల దయాదాక్షిణ్యాలపై సామాన్యులు ఆస్తి యాజమాన్య హక్కు ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని అమలు చేస్తే ప్రస్తుతం అమల్లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు, అడంగల్‌లు వంటి రికార్డులు రద్దు అవుతాయని చెప్పారు. ఆస్తి వివాదాలు పరిష్కరించుకునేందుకు సివిల్ కోర్టు విచారణ పరిధిని ఈ చట్టం ద్వారా తీసివేయటం శోచనీయమన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు వివిధ రూపాల్లో ఉద్యమాన్ని కొనసాగించాలని, త్వరలో రానున్న సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎపి యాజమాన్య హక్కు చట్టం దుష్ఫలితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా ఈ చట్టం రద్దుకు ప్రజల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ తిరిగి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానించారు. ఈ సదస్సులో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సోమసాని బ్రహ్మానందరెడ్డి, మాజీ బార్ అధ్యక్షులు శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళా ఎపిపి మృతి

ఈ సదస్సులో పాల్గొన్న విశాఖపట్నం మెజిస్ట్రేట్ కోర్టు అడిషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాయత్రి గుండెపోటుతో మృతి చెందారు. విశాఖ నుంచి వచ్చిన ఆమె ఈ కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత కొంతసేపటికే గుండెపోటుతో ఆమె కుప్పకూలిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ (ఐఐపిఇ - పెట్రో యూనివర్శిటీ) భవన సముదాయ నమూనా చిత్రం

దేశ అవసరాలు తీర్చేందుకు పెట్రో వర్సిటీ : మోడీ

- భవన నిర్మాణానికి వర్చువల్‌గా భూమిపూజ

ప్రజాశక్తి - సబ్బవరం (అనకాపల్లి)

దేశ అవసరాలను తీర్చడం కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ (ఐఐపిఇ - పెట్రో యూనివర్సిటీ)ని ఏర్పాటు చేసినట్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలిలో ఏర్పాటు కానున్న పెట్రోలియం యూనివర్సిటీ భవన సముదాయానికి వర్చువల్‌గా శనివారం మోడీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రో యూనివర్సిటీ దేశాభివృద్ధిలో కీలకం కానుందన్నారు. వనరుత్పాదక, పునరుత్పాదకతల్లో భారతదేశ శక్తిని స్వయం సమృద్ధిగా మార్చనుందని పేర్కొన్నారు. గ్లోబల్ ఎనర్జీ హబ్‌గా దేశాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పలు అంశాలపై పెట్రో యూనివర్సిటీ పరిశోధనలు చేయనుందన్నారు. ఎన్‌టిపిసి సహకారంతో సముద్రపు నీటి నుంచి హైడ్రోజన్ ఉత్పత్తి కోసం పెట్రో యూనివర్సిటీ కృషి చేస్తుందని చెప్పారు. రోజుకు ఒక టన్ను హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించామన్నారు. రూ.35 కోట్లతో విశాఖపట్నాన్ని తొలి హైడ్రోజన్ సిటీగా మార్చనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐపిఇ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేది, అధికారులు, స్థానిక సర్పంచ్ ఆకుల శ్రీహేమ, నాయకులు గణేష్, ఎంపిటిసి సభ్యులు గవర తులసిరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో 'ప్రైవేటు' నిపుణులు!

- లేటరల్ ఎంట్రీ పేరిట 25 మంది నియామకం
- మోడీ సర్కారు గ్రీన్‌సిగ్నల్
- విధాన నిర్ణయాలలో వారిదే కీలక పాత్ర

న్యూఢిల్లీ : 'ప్రైవేటు' పేరు వింటేనే పాలకుల మనసు పులకరించిపోతోంది. పరిపాలనను మరింత సులభతరం చేసే పేరుతో పెద్దమొత్తంలో జీతాలు చెల్లించి, ప్రైవేటు రంగానికి చెందిన 25 మంది నిపుణులకు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవులు కట్టబెట్టాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని నేతృత్వంలోని క్యాబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, 22 మంది డైరెక్టర్లు/డిప్యూటీ సెక్రటరీల నియామకానికి ఆమోదం తెలిపింది. వీరు వివిధ ప్రభుత్వ శాఖలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తారు.

సాధారణంగా సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల ఉద్యోగాలను అఖిల భారత సర్వీసులైన ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఓఎస్‌లతో పాటు ఇతర గ్రూప్-ఎ సర్వీసుల అధికారులు నిర్వర్తిస్తారు. తాజా నియామకాలు 'లేటరల్ ఎంట్రీ' తరహాలో జరుగుతున్నాయి. లేటరల్ ఎంట్రీ పథకాన్ని 2018లో ప్రారంభించారు. దీని ప్రకారం సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ స్థాయిలో నియామకాలు జరుపుతారు. ఈ స్థాయి అధికారులు విధాన నిర్ణయాలలో కీలక పాత్ర పోషిస్తారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగమవుతారు.

పది మంది సంయుక్త కార్యదర్శుల స్థాయి పోస్టుల భర్తీ కోసం లేటరల్ ఎంట్రీ పద్ధతి కింద సిబ్బంది శాఖ 2018 జూన్‌లో తొలిసారిగా దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ పోస్టుల్లో నియామకాలను యుపిఎస్‌సి చేపట్టింది. 2021 అక్టోబరులో మరోసారి 31 మంది అభ్యర్థుల నియామకాలకు సిఫార్సు చేసింది. వీరిలో ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, 19 మంది డైరెక్టర్లు, 9 మంది డిప్యూటీ సెక్రటరీలు ఉన్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వ సర్వీసుల్లో 38 మంది ప్రైవేటు రంగ నిపుణులు పని చేస్తున్నారు. వీరిలో 10 మంది సంయుక్త కార్యదర్శులు, 28 మంది డైరెక్టర్లు/డిప్యూటీ సెక్రటరీలు ఉన్నారు. మొత్తంమీద ప్రస్తుతం ఇలాంటి ప్రైవేటు నిపుణులు 33 మంది ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. వీరిలో 8 మంది సంయుక్త కార్యదర్శులు, 16 మంది డైరెక్టర్లు కాగా మిగిలిన 9 మంది డిప్యూటీ సెక్రటరీలు. వీరంతా ప్రభుత్వంలోని కీలక శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు సంయుక్త కార్యదర్శులు మూడేండ్ల పదవీకాలాన్ని కూడా పూర్తి చేసుకున్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని సిఐటియు విశాఖ జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారంనాటికి 1066వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయొద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చేపట్టిన ఉద్యమం వెయ్యి రోజులకుపైగా అకుంఠిత దీక్షతో సాగుతోందన్నారు. సరైన నిర్ణయం వచ్చే వరకూ ఉద్యమాన్ని ఎన్ని రోజులైనా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖ అభివృద్ధి చెందడంలో స్టీల్‌ప్లాంట్ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. అటువంటి కర్మాగారానికి సొంత గనులు కేటాయించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ ఆదివారం వందలాది మందితో సాగే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, నాయకులు కె.నర్సింగరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ల కోసం 1351 దరఖాస్తులు

- గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో దిగేందుకు టికెట్ల కోసం 1351 మంది దరఖాస్తు చేసుకున్నారని సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం సిడబ్ల్యుసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ సమావేశం ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిళ, ఎపి ఇన్‌చార్జి మయప్పన్‌లు పాల్గొన్నారు. సమావేశానంతరం గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 ఎంపి స్థానాలకు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆశావాహులతో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేరుగా మాట్లాడుతున్నారని చెప్పారు. సీట్ల కేటాయింలో 50శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీలకు కేటాయించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎన్‌ఎస్‌యుఐ, యువజన విభాగాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సెల్ విభాగాల అధ్యక్షుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. మీడియా సమావేశంలో పిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు.

కేఫ్ పేలుడు నిందితుడిని పట్టుకుంటాం

- కర్ణాటక సిఎం సిద్ధరామయ్య
- ఎఫ్ఐఆర్ నమోదు

బెంగళూరు : ఇక్కడి రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనలో నిందితుడి విజువల్స్ లభించాయని, దోషులను పట్టుకుంటామని కర్ణాటక సిఎం సిద్ధరామయ్య తెలిపారు. ఈ ఘటనలో గాయపడి బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏదైనా సంస్థ ప్రమేయం ఉందా లేదా ఒక వ్యక్తి ప్రమేయం ఉందా అనే అంశం ఇప్పటివరకూ తెలియదని చెప్పారు. ఈ ఘటనను ఖండిస్తున్నానని, రాజకీయం చేయొద్దని బిజెపిని ఉద్దేశించి అన్నారు. "మాస్క్, క్యాప్ ధరించిన ఒక వ్యక్తి బస్సులో వచ్చాడు, కేఫ్‌లోని కౌంటర్ నుండి 'రవ్వ ఇడ్లీ' కొని ఒక ప్రదేశంలో కూర్చున్నాడు. ఆపై అతను టైమర్ సెట్ చేసి వెళ్లిపోయాడు. పేలుడు సంభవించింది. దాదాపు 9 మంది గాయపడ్డారు. అందరూ ప్రమాదం నుంచి బయటపడ్డారు" అని సిద్ధరామయ్య తెలిపారు.

86 నిమిషాల వ్యవధిలోనే పేలుడు

రామేశ్వరం కేఫ్‌లో పేలుడుపై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సిసిబి) దర్యాప్తు చేస్తోంది. బాంబ్ స్క్వాడ్‌లు, ఫోరెన్సిక్ బృందాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించాయి. మంగళూరులో 2022లో జరిగిన పేలుడుకి సంబంధించిన ఐఇడిలు శుక్రవారం కేఫ్‌లో జరిగిన పేలుడులో ఉపయోగించిన ఐఇడిలకు మధ్య పోలిక ఉందా అనే కోణంలోనూ కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పక్కా ప్రణాళికతోనే 68 నిమిషాల వ్యవధిలోనే అనుమానిత వ్యక్తి రామేశ్వరం కేఫ్‌లో పేలుడుకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎఫ్ఐఆర్‌లో పలు కీలక అంశాలను పేర్కొన్నారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి మాస్కు ధరించి, తెల్లని టోపీ పెట్టుకుని 11.30 సమయంలో రామేశ్వరం కేఫ్‌లోకి వెళ్లాడు. 11.38 గంటలకు రవ్వ ఇడ్లీ ఆర్డర్ చేశాడు. 11.44 గంటలకు ఆ వ్యక్తి హ్యాండ్ వాష్ దగ్గరకు వెళ్లారు. బ్యాగు అక్కడే విడిచిపెట్టి 11.45 గంటలకు కేఫ్ నుండి బయటకు వచ్చాడు. మధ్యాహ్నం 12.56 గంటలకు కేఫ్‌లో పేలుడు సంభవించింది. నిందితుడు ఆహారం తీసుకోవడం చూసిన ఫ్లోర్ మేనేజర్ కీలక సాక్షిగా ఉన్నాడు.

వైఎస్ విగ్రహం ధ్వంసాన్ని నిరసిస్తూ రాస్తారోకో

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో చేపట్టారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొప్పునూరు గ్రామంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహం చేతిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి విరగ్గొట్టారని తెలిపారు. వైఎస్‌ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషిని మరువలేమని తెలిపారు. కొప్పునూరు-అనుపు ఎత్తిపోతల మంచినీటి పథకం మాచర్ల మండలంలోని గ్రామాల స్వరూపాన్ని మార్చిందని తెలిపారు. నియోజ కవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌గా బ్రహ్మారెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రశాంతం గా ఉన్న నియోజకవర్గం సమస్యాత్మకంగా మారిందని విమర్శించారు. టిడిపి నాయకుల అసత్య ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. కారంపూడిలో వైసిపి కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం చంద్రబాబు, మాచర్ల టిడిపి అభ్యర్థి బ్రహ్మారెడ్డి దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు.



చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరిన 'వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి' దంపతులు



ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

5న బిసి డిక్లరేషన్

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి వారు పొట్ట పెట్టుకున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, టిడిపి పొత్తు పెట్టుకున్నట్లు పునరుద్ఘాటించారు. నెల్లూరు జిల్లా రాజకీయాలు రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఉంటాయని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపిలో చేరడం అభినందనీయమని అన్నారు. నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలు గెలుచుకుంటామని, పులివెందులలో కూడా మంచి మెజార్టీ వస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. వైసిపి నుంచి టిడిపిలోకి నేతలు ఎందుకు వస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ జగన్ బాధితులేనని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఇప్పుడు క్విట్ జగన్ నినాదంతో పనిచేయాలని కోరారు. కొందరు అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, ఇటువంటి వారు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన వారిలో మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ బాబాయ్, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, సుమారు వంద మంది వైసిపి నేతలు ఉన్నారు.

టిడిపిలో చేరిన ఎమ్మెల్యే వసంత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైలవరం వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టిడిపిలో శనివారం చేరారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఈ కార్యక్రమంలో కృష్ణప్రసాద్ అనుచరులు కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు నెట్టెం రఘురామ్, టిడిపి నాయకులు కేశినేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- ముఖ్యమంత్రికి అచ్చెన్న లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సురక్షిత తాగునీరు అందక కలుషిత జలంతో డయేరియా, కలరా ప్రబలి ఆస్పత్రుల్లో చేరుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన సురక్షిత తాగునీరు అందించాలని, గుంటూరులో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన శనివారం లేఖ రాశారు. గ్రామ పంచాయితీ నిధులు దారి మళ్లించడం, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తాగునీటి పథకాలను సక్రమంగా నిర్వహించకపోవడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను అర్ధాంతరంగా నిలిపేయడం వంటి చర్యలతో ప్రజల ఆరోగ్య పరిస్థితి గాల్లో దీపంలా మారిందని తెలిపారు.

కాపుల మద్దతు జగన్‌కే.. మంత్రి అంబటి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రానున్న ఎన్నికల్లో కాపుల మద్దతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పంచన పవన్‌కల్యాణ్ చేరడంతో జనసేన మీద ఆశలు పెట్టుకున్న కాపులందరూ నిరుత్సాహపడ్డారని తెలిపారు. చంద్రబాబుకు అధికారం కట్టబెట్టాలని పవన్ చూడడం, పవర్ షేరింగ్ లేకపోవడం కాపులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. పవన్ కల్యాణ్ స్క్రీన్ మీద లేకపోవడంతో చంద్రబాబుకు మద్దతు పలికే పరిస్థితిలో కాపులు లేరన్నారు. వారంతా జగనే సిఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు.

ప్రయివేట్ దిశగా విశాఖ పోర్టు!

- పిపిపి కిందికి ఇన్నర్, అవుటర్ హార్బర్‌ల్లో 20 బెర్తులు
- రిజర్వు ఆదాయం డిపాజిట్లలో నిబంధనల ఉల్లంఘన


విశాఖ పోర్టు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉన్నత లక్ష్యంతో ఏర్పాటైన విశాఖ పోర్టు క్రమేపీ ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి జారిపోతోంది. ఈ పోర్టు విశాఖ నగరం అభివృద్ధి, పోర్టు ఆధారిత పరిశ్రమలకు ఊతమివ్వాల్సి ఉంది. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది. కానీ, పోర్టులో 2009 తర్వాత పర్మినెంట్ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా నిలిచిపోయింది. ఐదు వేలకుపైగా రెగ్యులర్ ఉద్యోగుల ఖాళీలు భర్తీ కాలేదు. బెర్తులపైనా, కార్యాలయాల్లోనూ కాంట్రాక్టు ఉద్యోగులతో పని చేయిస్తున్నారు. పోర్టు ఏర్పాటు నిబంధనల్లోనే ఉపాధి, విశాఖ నగర అభివృద్ధికి తోడ్పాటు అన్న షరతు ఉందని సీనియర్ పోర్టు అధికారులు గుర్తు చేస్తున్నారు. క్రమంగా విశాఖ పోర్టు ప్రయివేటు వైపునకు సాగుతోంది. పోర్టు బెర్తుల్లో 20 వరకూ ఇప్పటికే పిపిపిలోకి వెళ్లిపోవడంతో ఉపాధికి గండిపడి పోర్టు ఏర్పాటు లక్ష్యం నీరుగారుతోంది.

పోర్టులో ఏం జరుగుతోంది?

కేంద్రంలోని బిజెపి సర్కారు తెచ్చిన మేజర్ పోర్టుల అథారిటీ బిల్లు అమలుతో విశాఖ పోర్టు ప్రయివేట్ వ్యక్తులకు ఫలహారంగా మిగిలిపోతోందన్న విమర్శలూ ఉన్నాయి. పిపిపి విధానంతో వ్యాపారం చేస్తూ ల్యాండ్ పోర్టు అయిందంటూ కేంద్ర ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటోంది. ఏటా పోర్టుకు వచ్చే రూ.1200 కోట్ల సరుకు రవాణా వ్యాపార ఆదాయంలో రూ.800 కోట్లు ఖర్చులకుపోగా మిగిలిన రూ.400 కోట్లు ఆపరేషనల్ లాభం వస్తోంది. బిజెపి నిర్ణయంతో గత పదేళ్లలో మొత్తం రూ.4 వేల కోట్లు ఆపరేషన్ లాభాలు ప్రయివేట్ బ్యాంకుల్లో డిపాజిట్‌గా ఉంచారు. పోర్టు నిబంధనల ప్రకారం ప్రభుత్వ బ్యాంకులు (ఎల్ఐసి, షెడ్యూల్డ్ బ్యాంకులు)ల్లో 'పోర్టు రిజర్వు ఆదాయం' ఉంచాలి. ప్రయివేట్ బ్యాంకుల్లో ఉంచడంతో డబ్బు భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

పిపిపితో ఏమైనా లాభం ఉందా?

ఏటా పిపిపి ద్వారా పోర్టుకు రూ.150 కోట్లకు మించి ఆదాయం లేదు. ఇక్యూ-1 బెర్తును పదేళ్ల క్రితం అదానీకి ఇచ్చి పోర్టు యాజమాన్యం చేతులు కాల్చుకుని రూ.కోట్ల నష్టాన్ని ఏళ్ల తరబడి చవిచూసింది. పిపిపి విధానంలో ఇలాంటివి పోర్టును వెంటాడుతున్నా అధికారులు దాచి పెడుతున్నారు. సుమారు ఏడు బెర్తుల్లో ఇదే స్థితి ఉన్నా పోర్టు యాజమాన్యం కిమ్మనడం లేదు. అదానీ తరహా అనుభవం పునరావృత్తమైతే చేతులెత్తేయడం తప్ప మరోదారి ఉండదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన

వేలల్లో ఉన్న పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య 2009 నుంచి రిక్రూట్‌మెంట్ లేనందున వందల సంఖ్యకు పడిపోయింది. ఉద్యోగులు తక్కువ మంది ఉన్నా కష్టించి పనిచేయడంతో సరుకు రవాణాలో లక్ష్యాలను పోర్టు అధిగమిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 73 మిలియన్ టన్నుల సరుకును విశాఖ పోర్టు రవాణా చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 80 మిలియన్ టన్నులు సాధించే దిశగా కృషి జరుగుతోంది.

భూములకూ ఎసరొచ్చింది?

శాలిగ్రాంపురం, మల్కాపురం, కంచరపాలెం (సాంబమూర్తినగర్)లో పోర్టు క్వార్టర్స్ వందల ఎకరాల్లో ఉన్నాయి. వీటన్నింటినీ లీజుకిచ్చేయడానికి పోర్టు యాజమాన్యం నిర్ణయించింది. పోర్టు వీటిని అమ్ముకునే వీల్లేకపోయినా మేజర్ పోర్టుల అథారిటీ బిల్లు అమలు కాక ముందే విశాఖ పోర్టులో దుందుడుకుగా ముందుకెళ్తున్నారు. రహేజా కంపెనీకి రూ.400 కోట్ల విలువైన 27 ఎకరాలను కేవలం రూ.120 కోట్లకే లీజుకు పోర్టు యాజమాన్యం ఇదివరకే ఇచ్చేసింది. విసిటిపిఎల్, విసిటిపిఎల్-2 ప్రయివేట్ సంస్థలకు 80 ఎకరాలు కట్టబెట్టింది. 5.91 ఎకరాల్లో 1984లో ఏర్పాటు చేసిన పోర్టు ఆస్పత్రిని కూడా రూ.263 కోట్లకు పిపిపిలో ఇచ్చేసింది. ఇన్నర్ హార్బర్‌లో 11, అవుటర్ హార్బర్‌లో 9 బెర్తులను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించింది.


సెమినార్‌లో మాట్లాడుతున్న రమాదేవి

మహిళా దినోత్సవ స్ఫూర్తితో సమానత్వం కోసం ఉద్యమిద్దాం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పిలుపు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

అంతర్జాతీయ మహిళాదినోత్సవ స్ఫూర్తితో సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం ఒంగోలులోని స్థానిక హర్షిణీ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. 1910లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగిన సందర్భంలో మహిళలతో పాటు పురుషులు కూడా పెద్దఎత్తున సభలు, సమావేశాలు, ప్రదర్శనల్లో పాల్గొని స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించారని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా మహిళలు అనేక హక్కులు, చట్టాలను సాధించుకోగలిగారని చెప్పారు. ఓటు హక్కు సాధించడమే కాకుండా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అనేక అంశాలలో మహిళా రిజర్వేషన్ సాధించామని తెలిపారు. సాధించిన హక్కులు, చట్టాలను నిలబెట్టుకుంటూ సమానత్వాన్ని సాధించడం కోసం ఉద్యమించడమే నేడు మహిళల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. సెమినార్‌కు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జల్లెడ రాజశేఖర్ ఎవి నాగేశ్వరరావు ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్‌ను, జెన్‌కో ఎండి చక్రధర్ బాబును, ట్రాన్స్‌కో జెఎండి మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్, వాచ్‌మెన్లకు షిఫ్ట్ ఆపరేటర్లుగా వేతనాలు వెంటనే ఇవ్వాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్లలో నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని, జెన్‌కో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. డైరెక్ట్ పేమెంట్, రెగ్యులరైజేషన్ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు. మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని, ఇతర సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ సమావేశాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

అవినీతిపరులకు బుద్ధి చెప్పాలి..

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (హెచ్-176 సిఐటియు అనుబంధం) నుంచి బహిష్కరణకు గురైన కొందరు యూనియన్ పేరుతో కార్మికుల్ని మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారి మాయ మాటల ప్రభావంలో పడొద్దని ఉద్యోగులకు, కార్మికులకు సూచించారు. పోరాటాలే పరమావధిగా, నిరంతరం కార్మికుల సమస్యలపై నిజాయితీగా పనిచేస్తున్న యూనియన్ పేరు చెప్పి డబ్బులు అడిగిన వారికి కార్మిక వర్గమే తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

బిజెపిని, ఆ పార్టీని బలపరిచే వారిని ఓడించండి

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపిని, దానిని బలపరిచే పార్టీలను ఓడించాలని కార్యకర్తలను సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. సిపిఐ ఉమ్మడి కర్నూలు జిల్లా జనరల్ బాడీ సమావేశం శనివారం నంద్యాలలోని దేవి ఫంక్షన్ హాలులో జరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యదర్శులు బి.గిడ్డయ్య, ఎన్ రంగనాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ.. కర్నూలు పశ్చిమ ప్రాంతం కరువుతో అల్లాడుతోందన్నారు. మోడీ గ్రాఫ్ పడిపోవడంతో రామాలయాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తూ 400 సీట్లు గ్యారంటీ అని చెబుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి టిడిపి, వైసిపి, జనసేన నాయకులు సాష్టాంగ నమస్కారం చేస్తున్నారని విమర్శించారు. మణిపూర్ లాంటి ప్రాంతాల్లో ఆదివాసీలను ఊచకోత కోసేలా చేసి అక్కడి సంపదను


జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ప్రయివేటు వారికి అప్పజెప్పాలని చూస్తోందని మండిపడ్డారు. అయోధ్య ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, కె. రామాంజనేయులు, ఆవుల శేఖర్, రైతు సంఘం నాయకులు, జగన్నాథం మాట్లాడారు.

10న వైసిపి మేనిఫెస్టో

- సిద్ధం సభలో విడుదల జేస్తామన్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఈ నెల 10న నిర్వహించనున్న సిద్ధం సభలో మేనిఫెస్టోను విడుదల చేస్తామని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి తెలిపారు. ఐదు సంవత్సరాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఈ మేనిఫెస్టోలో పొందుపర్చుతామని చెప్పారు. ఒంగోలులోని ఓ ఫంక్షన్ హాల్లో సిద్ధం సభ సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధం సభ పోస్టర్‌ను, ప్రచార పాటను విడుదల చేశారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మేదరమెట్లలో నిర్వహించే సిద్ధం సభకు తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి సుమారు 15 లక్షల మంది హాజరవుతారని అంచనావేస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో ప్రజలకు మరింత మంచి పాలన ఏ విధంగా అందిస్తామన్న దానిపై, మేనిఫెస్టోలో యే అంశాలు పొందుపరిచామన్న విషయాలను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడిస్తారని తెలిపారు. మార్చి 13, 14 తేదీల్లో ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, కాకాని గోవర్ధనరెడ్డి, అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ ధర తగ్గించలేం

- ఫిబ్రవరి హుండీ ఆదాయం రూ.111 కోట్లు
- డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో ఎవి ధర్మారెడ్డి


డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మారెడ్డి, ఇతర అధికారులు

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవారి లడ్డూ పరిమాణం, బరువు తగ్గలేదని, ధర తగ్గించడానికి వీలులేదని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో భాగంగా ఓ యాత్రికుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పై వ్యాఖ్యలు చేశారు. లడ్డూలు రెండే ఇస్తున్నారు? పది ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మరో యాత్రికుడు అడగ్గా.. శ్రీవారిని దర్శించుకున్న ప్రతి యాత్రికుడికి ఓ ఉచిత లడ్డూ ఇస్తున్నామని, వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవాలప్పుడు తప్ప, మిగిలిన సమయంలో కావాల్సినన్ని లడ్డూలు యాత్రికులు పొందవచ్చని ఇఒ సమాధానమిచ్చారు. 'ఫిబ్రవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.111.71 కోట్లు వచ్చింది. 10.06 లక్షల మంది యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నారు. 95.43 లక్షల లడ్డూలను విక్రయించాం. 6.56 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. ఏప్రిల్ నుంచి జులై వరకు యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సామాన్య యాత్రికులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లు తగ్గించాం. తిరుమలలో దాదాపు 7500 గదులు ఉన్నాయి. వీటిలో 45 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85 శాతం గదులు సామాన్య యాత్రికుల కోసమే కేటాయిస్తున్నాం. వేసవిలో తిరుమలకు తరలివచ్చే వేలాది మంది యాత్రికులకు అవసరమైనన్ని వసతి సౌకర్యం లేనందున తిరుపతిలో వసతి పొందాలి'. అని ఇఒ తెలిపారు.

కేంద్రానికి పిఎస్‌యుల బంపర్ డివిడెండ్

- అంచనాలకు మించి అందజేత
- 11 మాసాల్లోనే రూ.51,556 కోట్లు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను ప్రయివేటు శక్తులకు తెగనమ్మడానికి ఎప్పుడూ ఆసక్తి చూపే బిజెపి సర్కార్ ఖాజానాకు అవే పిఎస్‌యులు ఊపిరిపోస్తున్నాయి. ఆ సంస్థలు అంచనాలు మించి రికార్డ్ స్థాయిల్లో డివిడెండ్‌లను అందిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి 11 మాసాల్లో కేంద్ర ప్రభుత్వానికి విత్త యేతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు భారీ డివిడెండ్‌ను ప్రకటించాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.51,556 కోట్ల డివిడెండ్‌ను అందించాయి. 2023-24లో విత్తయేతర పిఎస్‌యుల నుంచి రూ.50వేల కోట్ల డివిడెండ్ రావొచ్చని గత నెలలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేయగా.. అంతక్రితం తొలుత రూ.43,000 కోట్లు అందవచ్చని మోడీ సర్కార్ భావించింది. ఈ అంచనాలకు భిన్నంగా ఇప్పటికే అత్యధికంగా డివిడెండ్ ఆదాయాలు కేంద్రానికి చేరాయి. మరో నెల రోజుల్లో ఇంకా అనేక సంస్థలు డివిడెండ్‌ను ప్రకటించనున్నాయి. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి డివిడెండ్ రాబడి 55,000 కోట్లకు మించవచ్చు. విద్యుత్ వంటి వివిధ రంగాలలోని సిపిఎస్‌యులు బాగా పనిచేస్తున్నాయి." అని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.

గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.43వేల కోట్ల డివిడెండ్ అంచనా వేయగా.. రూ.59,533 కోట్లు ప్రకటించాయి. ఇంతక్రితం 2021-22లో రూ.46వేల కోట్లు అంచనా వేయగా రూ.59,294 కోట్లు, 2020-21లో రూ.34,717 కోట్లు అంచనా వేయగా.. రూ.39,608 కోట్ల చొప్పున డివిడెండ్‌ను అందించాయి. ఒఎన్‌జిసి, గెయిల్, ఎన్‌టిపిసి, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఐఆర్‌ఎఫ్‌సి, సెయిల్‌తో సహా సిపిఎస్‌ఇలు ఈ ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్‌లను అందించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాయి. మోడీ సర్కార్ బడ్జెట్‌లో అంచనా వేసిన దాని కంటే అధిక డివిడెండ్‌ను అందించి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నాయి. అయినా.. బిజెపి ప్రభుత్వం ఏడాదికేడాదికి పిఎస్‌యుల్లో వాటాల విక్రయాన్ని వేగవంతం చేయడం గమనార్హం.


పెన్నానది వద్ద ఆందోళనలో జెసి.ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిలో పైప్‌లైన్ వివాదం

- పెన్నానదిలో టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ వివాదం రాజుకుంది. గత రెండు రోజులుగా టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇరు గ్రూపుల వారు శనివారం పెన్నానదిలోని నీటి సరఫరా బోర్ల వద్దకు వెళ్లారు. తాము అభివృద్ధి చేస్తున్నామంటే.. లేదు తామే అభివృద్ధి చేస్తున్నామంటూ ఒకరికి ఒకరు సవాళ్లు విసురుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని రెండు గ్రూపులను అక్కడి నుంచి పంపి వేయడంతో సమస్య కాస్త సద్దుమణిగింది.

తాడిపత్రి పెన్నా నది నుంచి మున్సిపాల్టీకి నీరు సరఫరా చేసే 21 బోర్లకు సంబంధించిన పైపులు గతంలో వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తన సొంత నిధులతో మరమ్మతులు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పనులను పరిశీలించేందుకు శనివారం ఉదయం టిడిపి కౌన్సిలర్లు పెన్నా నది వద్దకు వెళ్లారు. అయితే అప్పటికే అక్కడికి వైసిపి కార్యకర్తలు చేరుకుని.. పైపుల మరమ్మతు పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ఖర్చును తామే భరిస్తున్నామని తెలిపారు.

జెసి.ప్రభాకర్ రెడ్డి చేస్తున్న గొప్ప ఏమీ లేదంటూ ఆయనకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు నినాదాలు చేశారు. దీంతో టిడిపి నాయకులు ప్రతిగా వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాడిపత్రి డిఎస్‌పి గంగయ్య తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రెండు వర్గాల వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు : జెసి.ప్రభాకర్‌రెడ్డి

అభివృద్ధి చేస్తామంటే వైసిపి నేతలు అడ్డుకోవడం సరికాదని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణ అనంతరం పెన్నా నది పరివాహక ప్రాంతంలోని అరబిందో పంప్‌హౌస్ వద్దకు జెసి.ప్రభాకర్ రెడ్డి చేరుకున్నారు. అధికారులుకూడా అభివృద్ధికి సహకరించాలన్నారు.

ప్రత్యేక సెషన్‌లో మార్కెట్లకు లాభాలు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 61 పాయింట్లు పెరిగి 73,806కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 40 పాయింట్లు లాభపడి 22,378 వద్ద ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ కొత్త జీవన కాల గరిష్ఠాలకు చేరాయి. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు తొలి సెషన్ జరగ్గా.. ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య మరో సెషన్‌ను నిర్వహించారు. ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించాయి. తొలుత ప్రాథమిక సైట్‌లో ట్రేడింగ్ జరపగా.. తర్వాత డిజాస్టర్ రికవరీ సైట్‌లో ట్రేడింగ్ జరిపారు.

అత్యధికంగా 98.6 శాతం క్లయిమ్‌ల సెటిల్‌మెంట్

- ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ వెల్లడి

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బీమా పరిశ్రమలోనే తమ సంస్థ అత్యుత్తమ క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తిని నమోదు చేసిందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. పాలసీదారుడు అకాల మరణం చెందితే కుటుంబాలకు ఆర్థిక మద్దతును నిర్ధారించడానికి ఇది తమ సంస్థ చేసిన వాగ్దానం అని పేర్కొంది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో 98.52 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం చేసినట్లు తెలిపింది. 2023 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 98.10 శాతం, రెండో త్రైమాసికంలో 98.14 శాతం క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు పేర్కొంది.


భారత యాప్‌లను తొలగించడం తప్పు

- గూగుల్ ప్లే స్టోర్‌పై కేంద్ర మంత్రి ఆగ్రహం

న్యూఢిల్లీ : గూగుల్ తన ప్లే స్టోర్ నుంచి 10 భారతీయ యాప్‌లను తొలగించాలనే చర్య తప్పని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. గూగుల్ అధికారులతో చర్చ జరిపిన తరువాత సానుకూలమైన ఫలితం రావచ్చని, తప్పకుండా ఈ కంపెనీలను రక్షించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై టెక్ కంపెనీ, సంబంధిత స్టార్టప్‌ల ప్రతినిధులతో సోమవారం భేటీ కానున్నామని మంత్రి తెలిపారు. సర్వీస్ ఫీజు చెల్లింపులపై వివాదాల నేపథ్యంలో గూగుల్ భారతీయ కంపెనీల యాప్‌లను తొలగించాలని నిర్ణయించింది. ఇందులో మాట్రిమోనీ.కామ్, షాదీ.కామ్, ఇన్ఫోఎడ్జ్, అన్‌అకాడమీ, ఆహా, డిస్నీ హాట్‌స్టార్, ట్రూలీ మ్యాడ్లీ, క్వాక్‌క్వాక్, స్టేజ్, కుటుంబ్, టెస్ట్‌బుక్ ఉన్నాయి.

పొంతన లేని జిడిపి లెక్కలు

- పడిపోయిన ఆదాయం
- అయినా వృద్ధి గణాంకాల ఉరకలు..?



న్యూఢిల్లీ : మోడీ సర్కార్ విడుదల చేసిన జిడిపి గణంకాలకు వాస్తవ అంశాలకు అమాంతం పొంతన లేకుండా పోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జిడిపి 8.4 శాతం పెరిగిందని ఎన్ఎస్ఒ గణంకాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ లెక్కలు గృహ వినియోగం, ఆదాయ పరిస్థితి వాస్తవికతకు విరుద్దంగా ఉన్నాయి. గడిచిన నాలుగేళ్లలో వాస్తవ ఆదాయాల్లో కేవలం 3 శాతం మాత్రమే పెరుగుదల ఉందని 11 ఏళ్ల తర్వాత జాతీయ వ్యయ సర్వే (2022-23) విడుదల చేసిన లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)లో పేర్కొంది. అనేక వినియోగదారుల ఉత్పత్తుల కంపెనీలు డిమాండ్ కొరతను ఎదుర్కొంటున్నాయి.

దిగుమతుల్లోనూ భారీ తగ్గుదల, వ్యయాల్లో తగ్గుదలను సూచిస్తున్నాయి. 2023 డిసెంబర్ త్రైమాసికంలో దిగుమతులు 22 శాతం పతనం కాగా.. ఎగుమతుల్లో స్వల్పంగా 0.9 శాతం పెరుగుదల ఉంది. ప్రయివేటు వినిమయంలో 0.7 శాతం తగ్గుదల నమోదయ్యింది. ప్రజల ఆదాయాలు, వ్యయాలు, పొదుపు అంశాలు బలమైన వృద్ధిని తెలియజేస్తాయి. కానీ.. ప్రజల ఆదాయాల్లో పెద్ద పెరుగుదల లేకపోగా.. ఖర్చులు అమాంతం పెరగడంతో పొదుపు స్థాయిలు తగ్గిపోయాయి.

రోడ్లు, రైల్వేలు, రక్షణ రంగ తదితర మౌలిక రంగ వసతులు 5.2 శాతం పెరుగుదల ఉండొచ్చని ఇటీవలి మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేసింది. ఇది కూడా దేశీయ డిమాండ్‌లో తగ్గుదలను చూపిస్తోంది. గడిచిన జనవరిలో ఎనిమిది ప్రధాన మౌలిక రంగాల వృద్ధి 3.6 శాతానికి పరిమితమై.. 15 నెలల కనిష్ఠాన్ని తాకింది.

రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు తదితర రంగాల్లో పనితీరు పేలవంగా చోటు చేసుకుందని స్వయంగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణంకాల్లో తేలింది. దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఏకంగా 40.27 శాతం వాటా కలిగిన ఎనిమిది అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాలు పేలవ ప్రదర్శన కనబర్చుతుంటే.. మరోవైపు జిడిపి భారీగా పెరగడం బిజెపి సర్కార్ మాయాజాలాన్ని స్పష్టం చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లో ఎఫ్‌డిఐల్లో ఏకంగా 13 శాతం పతనమై 32.03 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, సేవలు, టెలికం, ఆటో, ఔషధ, రసాయన రంగాల్లో ఎఫ్‌డిఐలు దిగజారినట్లు తేలింది. ఆదాయాలు తగ్గడం, దిగుమతుల్లో పతనం, ఎగుమతులు అంతంత మాత్రమే, ఎఫ్‌డిఐల్లో క్షీణత నేపథ్యంలో మరోవైపు జిడిపి అమాంతం పెరుగుదల తీవ్ర అనుమానాలకు దారి తీస్తోంది.

సంపాదకీయం

సోషల్ మీడియాపై అణచివేత

సోషల్ మీడియా మన దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ఒకప్పుడు ఫోటోల షేరింగ్, చాటింగ్ వరకే పరిమితమైన సోషల్ మీడియా– ప్రస్తుతం రోజువారీ రాజకీయ పరిణామాలు సహా అన్నిరకాల విశేషాలకు వేదికగా వుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి దీనిని మలుచుకుంటున్నాయి. అంతేకాదు... ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టే ఉద్యమాలు, నిరసనలకు కూడా ఇది వేదికయ్యింది. దేశంలోని అత్యధిక విజువల్ మీడియాను బ్లాక్ మెయిల్ చేసి బెదిరిస్తున్న మోడీ సర్కార్ కన్ను ఇప్పుడు సోషల్ మీడియాపై పడింది. 'సోషల్ మీడియా అనేది అంతిమ సమీకరణం. దీనిలో నిమగ్నం కావాలనుకునేవారికి ఇది గొంతుక అవుతుంది' అంటారు అమి జో మార్టిన్. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటానికి, ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశంలో చెలరేగిన నిరసనలకు ఎంతగానో తోడ్పడింది. బిజెపి ప్రభుత్వం రెండు సమ్మెలను నిరంకుశంగా అణిచివేసేందుకు యత్నించినప్పుడు సోషల్ మీడియా వేదికగా నిరసనాగ్రహాలు వెల్లువెత్తాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది.

ట్యునీషియా వంటి దేశాల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజా వెల్లువ రావడంలో సోషల్ మీడియా కీలక భూమిక వహించింది. నియంతలను అధికారం నుండి తరిమికొట్టడానికి ప్రజల చేతిలో వజ్రాయుధంగా మారింది. గ్రీస్, స్పెయిన్, ఇజ్రాయిల్‌లో కార్మికుల నిరసనలు, గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న విధ్వంసకాండ వంటి పలు అంశాలను కార్పొరేట్ మీడియా కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తే, సోషల్ మీడియా ఆ గుట్టును రట్టు చేసింది. ముఖ్యంగా భారతదేశంలో పాలకులు తమ ఎజెండాకు అనుగుణంగా నకిలీ వార్తలు, వక్రీకరించిన వాస్తవాలు, తప్పుడు ప్రచారాలను వ్యాప్తిచేయడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని నినదిస్తున్న రైతు సంఘాల ఆందోళనను అణిచివేయడంలో భాగంగా ప్రభుత్వం సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపుతోంది. రైతు నాయకులు, రైతు సంఘాలు, జర్నలిస్టులు, మీడియా సంస్థలు తమ సోషల్ మీడియా ఖాతాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నోటీసులు పంపడమే ఇందుకు ఉదాహరణ. ఒక్క 'ఎక్స్' (ట్విటర్)కే కేంద్ర ఐటీ–ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటివరకు 177 నోటీసులు అందాయి. ట్వీట్లను ఉపసంహరించుకోవాలని, ఖాతాలను మూసివేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని బెదిరించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ఇతర సామాజిక మాధ్యమాలకు కూడా రైతు నిరసన పోస్ట్‌లు, వీడియోలు, చిత్రాలను ఉపసంహరించుకోవాలని కేంద్రం నుండి ఇటీవల నోటీసులు వెళ్లాయి. మరీ దారుణమైన విషయమేమిటంటే, 2020–21 రైతుల నిరసనపై రూపొందించిన 'కిసాన్ సత్యాగ్రహ' డాక్యుమెంటరీ బెంగుళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మార్చి 1న ప్రదర్శించాల్సి వుండగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆ ప్రదర్శనను అడ్డుకుంది. 'నేను వజ్రాల ధరకు గాజును కొనుగోలు చేయను. మానవత్వంపై దేశభక్తి గెలవడానికి నేను ఎన్నటికీ అనుమతించను' అన్న ఠాగూర్ మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం ఎంతైనా సముచితం. గతంలోనూ నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌పై తీసిన 'భారతీయ తార్కికుడు' అనే డాక్యుమెంటరీనీ ఇలాగే అడ్డుకున్నారు.

చివరికి గూగుల్ ఏఐ సాధనం 'జెమిని'పై కూడా కేంద్రం జోక్యం చేసుకుంది. 'మోడీ ఫాసిస్టు కాదా?' అని అడిగితే, 'ఆయన విధానాలు ఫాసిస్టు తరహాలోనే ఉన్నాయని' జెమిని సమాధానమివ్వడం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉపసంహరణ సమయంలో, జమ్మూ–కశ్మీర్ విభజన విషయంలో, మణిపూర్ విషాదంలో– నెలల తరబడి ఇంటర్నెట్‌ను నిషేధించారు. రైతుల సమ్మె దృష్ట్యా ఎటువంటి కారణం లేకుండా హర్యానా, యుపి, రాజస్థాన్‌లలో ప్రభుత్వం ఇంటర్నెట్‌ను బంద్ చేసింది. 2012 నుండి 2023 మధ్యకాలం వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 741 సార్లు ఇంటర్నెట్ నిషేధించబడింది. ఒక్క ఇంటర్నెట్ బ్యాన్ వల్ల దేశానికి జరిగిన ఆర్థిక నష్టం దాదాపు రూ.5వేల కోట్లు. మోడీ పాలనలో భావప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఎలా కుంచించుకుపోతున్నాయో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

మహనీయుల మాట



అందమైన బాహ్య రూపం
ఎప్పుడైనా మోసం చెయ్యవచ్చు.
కానీ విప్లవం పట్ల నిబద్ధత గల
ఆత్మ సౌందర్యం
ఏనాటికీ మోసం చెయ్యదు.

- మావో జెడాంగ్,
చైనా కమ్యూనిస్టు యోధుడు.

毛澤東

బిజెపి ఎత్తుల కసరత్తులు, దేశానికి విపత్తులు

ప్రస్తుతం

ప్రధాని మోడీ అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ట చేసి బిజెపి ఓటుబ్యాంకు అపారంగా పెంచారన్న ప్రచారం చూస్తున్నదే. అయితే పాలకపక్షం పాచికలు అంతటితో ఆగడం లేదు. మోడీ అసాధారణ మానవుడైనట్టు, అతీత శక్తులున్నట్టు ఇప్పుడు భజన మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ ఆయన తన బిజెపి అగ్రనేతలతో పాటు ఎన్నికల కసరత్తు చేశారట. తర్వాత కాస్త కునుకుతీసి వెంటనే బెంగాల్‌కు విమానంలో బయలుదేరి వెళ్లారట. ఏదో దైవదత్తమైన శక్తి వుంటే తప్ప ఇలా చేయడం సాధ్యం కాదని బిజెపి వంతదారుగా వుండే నటి కంగనా రనౌత్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆయన బయలుదేరుతున్న దృశ్యంపై ఇలాంటి వ్యాఖ్యతో ప్రభుత్వ వర్గాలు చేసిన పోస్టునే ఆమె పొందుపర్చారు. "ప్రధానిని ఏదో దివ్యలోక శక్తి నడిపిస్తుండకపోతే ఈ మానవాతీత సమర్ధతకు, పట్టుదలకు మరే కారణముంటుంది?' అని ఆమె ఆశ్చర్యం వెలిబుచ్చారు. 73 ఏళ్ల ప్రధాని తెల్లవారుజామున 3.30 వరకూ పని చేసి బయిలుదేరారని ఆమె పొందుపర్చిన పోస్టులో వుంది. కింద వీరభక్తులు కొందరు నిజంగానే ఆయనకు ఏదో దివ్యప్రేరణ వుందని వంతపాడితే మరికొందరు ఎన్నికల సమయంలో ఇలాంటివి తప్పవు. మరీ దేవుణ్ని చేయొద్దని వ్యాఖ్యానించారు. వాస్తవానికి 1977లో ఎమర్జెన్సీని ప్రజలు ఓడించిన తర్వాత ఏర్పడిన జనతా ప్రభుత్వ ప్రధాని మొరార్జీ దేశాయికి 82 ఏళ్లు. వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్‌లతో సహా కొందరు గత ప్రధానులు ఇంతకన్నా పెద్దవారే. వారి వారి పద్ధతులలో పనిచేశారు. ప్రచారక్ ప్రధాన మంత్రి (పిపిఎం) నరేంద్ర మోడీ వారికన్నా ఎక్కువగా సంచరించే పనుల్లో భాగం పంచుకునే మాట నిజమే గాని అది ఆయన అలవాటు. తన ఆరోగ్యాన్ని, దారుఢ్యాన్ని ప్రశంసించవచ్చునేమో గాని దైవదత్తమైన శక్తి ఆపాదించడం హాస్యాస్పదమే. అయితే అది వ్యూహాత్మకంగానే జరుగుతున్న పని. కాంగ్రెస్ బలహీనపడిన పరిస్థితులలో మిగిలిన పార్టీలను కూడా బిజెపి తన వైపు తిప్పుకోవడంతో ఒంటరిగా ఆధిక్యత సాధించిన మాట నిజమే. అయితే ఇదివరలో ఎవరూ రెండు సార్లు ప్రధాని కానట్టు, అదేదో అద్భుతమైనట్టు అదేపనిగా చెప్పుకోవడం వాస్తవికత కాదు. మోడీని దేశానికి నేతగానే గాక విశ్వగురువంటూ ఆయన వల్లనే అంతర్జాతీయ సంక్షోభాలు ఆగిపోతున్నాయని, మూడో ప్రపంచ యుద్ధం రాకుండా చూడగలిగారని పొగడ్డం వెగటు పుట్టిస్తుంది. మతాన్ని, దేవుణ్ని వాడుకోవడం కాస్త తననే దైవాంశ సంభూతుడుగా, తనే ఒక మత ప్రవక్తగా చేసే ప్రక్రియ రాబోతున్నట్టు కనిపిస్తుంది. ఆ భ్రమను కాపాడటానికి మోడీ నిరంతరం తపిస్తూనే వుంటారు. ఈ మధ్య సముద్రగర్భంలోని ద్వారకా శిథిలాల దగ్గర ప్రణామం చేయడానికి నీళ్లలో మునిగిరావడం పెద్ద ప్రచారాంశమైంది. నిజానికి అక్కడ దూకడం, తేలడం తప్ప మిగిలింది కనిపించదు. ఆయనను పొగుడుకోవడం తప్ప మరేమీ మిగలని పాలక కూటమి పరిస్థితిని ఇది ప్రతిబింబిస్తుంది.



> **శనివారం నాడు 195 మంది లోక్‌సభ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఇందుకోసం చాలా లోతైన సర్వేలు జరిపారట. తమాషా ఏమంటే తమ పార్టీనే గాక అవతలి పార్టీలలో బలమైన అభ్యర్థులున్నా ముందే ప్రజాభిప్రాయం తెలుసుకుని వారిని తమవైపు తిప్పుకోవడం ఎలాగో పాచికలు వేశారట. ఇందులోని రాజకీయ అనైతికతను గురించి విడిగా చెప్పాల్సిన అవసరమేముంది? గెలవడం ముఖ్యం, ఎలా ఎవరితో ఏ పద్ధతిలో అనేది అప్రస్తుతం. ఈ సూత్రంతోనే మోడీ-అమిత్ షా ద్వయం లెక్కలేనన్ని కుట్రలతో ప్రతిపక్ష శిబిరాన్ని చిందరవందర చేయడానికి ప్రయత్నించింది. వ్యతరేకించే మీడియాను, మేధావులను, రచయితలు, కళాకారులను, ఉద్యమకారులను వేటాడుతున్నది. న్యాయవ్యవస్థ కూడా ఒత్తిడికి గురవుత్నునట్టు అత్యున్నత న్యాయమూర్తులే అనేకసార్లు ఆవేదన వెలిబుచ్చిన పరిస్థితి. ఇందుకోసం నిజాయితీపరులైన న్యాయమూర్తుల నియామకాలు తొక్కిపట్టడం, ఉద్యోగ విరమణ తర్వాత పదవుల ఎరలు పరిపాటిగా మారాయి.**

నేతలపై గాలం, పార్టీలపై దాడి

నిజంగా బిజెపికి, మోడీకి అంత సత్తా వుంటే అహోరాత్రాలు అన్ని కసరత్తులు చేయవలసిన అవసరమే వుండేది కాదు. ఉదాహరణకు శనివారం నాడు 195 మంది లోక్‌సభ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఇందుకోసం చాలా లోతైన సర్వేలు జరిపారట. తమాషా ఏమంటే తమ పార్టీనే గాక అవతలి పార్టీలలో బలమైన అభ్యర్థులున్నా ముందే ప్రజాభిప్రాయం తెలుసుకుని వారిని తమవైపు తిప్పుకోవడం ఎలాగో పాచికలు వేశారట. ఇందులోని రాజకీయ అనైతికతను గురించి విడిగా చెప్పాల్సిన అవసరమేముంది? గెలవడం ముఖ్యం, ఎలా ఎవరితో ఏ పద్ధతిలో అనేది అప్రస్తుతం. ఈ సూత్రంతోనే మోడీ–అమిత్ షా ద్వయం లెక్కలేనన్ని కుట్రలతో ప్రతిపక్ష శిబిరాన్ని చిందరవందర చేయడానికి ప్రయత్నించింది. వ్యతరేకించే మీడియాను, మేధావులను, రచయితలు, కళాకారులను, ఉద్యమకారులను వేటాడుతున్నది. న్యాయ వ్యవస్థ కూడా ఒత్తిడికి గురవుత్నునట్టు అత్యున్నత న్యాయమూర్తులే అనేకసార్లు ఆవేదన వెలిబుచ్చిన పరిస్థితి. ఇందుకోసం నిజాయితీపరులైన న్యాయమూర్తుల నియామకాలు తొక్కిపట్టడం, ఉద్యోగ విరమణ తర్వాత పదవుల ఎరలు పరిపాటిగా మారాయి. ఇలాంటి నేపథ్యంలో ఇక ప్రతిపక్షాలనూ ప్రజా ఉద్యమాలను సహించే ప్రసక్తి లేకుండా పోతున్నది. రైతాంగ ఆందోళనను అణచివేయడానికి రాజధానిని బహిరంగ చెరసాలగా మార్చిన తీరే ఇందుకు తాజా నిదర్శనం.

నిజంగా అంతుందా?


ఇవన్నీ ఒక ఎత్తయితే రాబోయే ఎన్నికలలో ఎలాగైనా మూడోసారి గెలవాలని మోడీ బృందం చేస్తున్న విన్యాసాలు, విపరీత పోకడలు అత్యంత అప్రజాస్వామికంగా వున్నాయి. మానసికంగా తమ మాటకు ఎదురు లేదనే భావన పెంచడం ఇందులో మొదటిది. రాబోయేది తామేనని నమ్మించడం రెండవది. గతంలో కాంగ్రెస్ 30 ఏళ్లు పాలించినట్టే ఇప్పుడు బిజెపి వంతు వచ్చిందన్న వాతావరణం కలిగించడంలో పరమార్థం అదే. అయితే అప్పటికీ ఇప్పటికీ దేశ రాజకీయ దృశ్యంలో బలాబలాలలో వచ్చిన మార్పులను చూసిన వారెవరైనా ఇది కేవలం భ్రమేనని చెప్పగలరు. తన రాజకీయ మిత్రులతో కలసి దేశంలో కేవలం 15 రాష్ట్రాలు అంటే ఇంచుమించు సగం మాత్రమే బిజెపి పాలించగలుగుతున్నది. దక్షిణాన తూర్పున బాగా వెనకబడి వుంది. ఈ లోటు భర్తీ చేసుకోవడం కోసం మోడీ పడని పాట్లు లేవు. ఈ వారంలోనే ఆయన తమిళనాడు, కేరళ పర్యటించారు. తెలంగాణకు రాబోతున్నారు. ఎ.పి కి సంబంధించి వర్చ్యువల్ పద్ధతిలో ప్రారంభోత్సవాలు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారును ఇబ్బంది పెట్టడానికి ఇ.డి, సిబిఐలను ప్రయోగిస్తున్నారు. తమిళనాడు కేరళ, ఎ.పి తెలంగాణలలో ఇప్పటికీ కావలసినంతగా వాటిని దుర్వినియోగం చేశారు. అయితే మోడీ లేకుంటే ఇ.డి అంటూ దాన్ని ఆయనకు పర్యాయపదంగా చేశారు. ఇంతటి అప్రజాస్వామిక పాలన ఈ తరహాలో దేశం ఇదివరకెన్నడూ చూడలేదు. అయితే ఆయన కార్పొరేట్లకు వరాల వర్షం కురిపిస్తూ సంఘ పరివార్ ఎజెండాను తుచ తప్పకుండా అమలు చేస్తారు గనక ఈ రెండు బలమైన వర్గాలు వత్తాసునిస్తున్నాయి. వారి చేతుల్లోని బడా మీడియా ఎప్పుడూ ఆయనను కీర్తించే పనిలో మునిగి తేలుతున్నది. 2024 హ్యాట్రిక్ గీతావళి ఇందులో ఇప్పుడు ముందుకొచ్చి కూర్చుంది.

కసరత్తులో ఎత్తులు

గత నాలుగురోజులుగా వింటున్న ఎన్నికల కసరత్తుల గురించే చూద్దాం. తమిళనాడులో అన్నాడిఎంకెను, కర్ణాటకలో జెడిఎస్‌ను దారికి తెచ్చుకున్న బిజెపి కేరళలో కళ్లు తేలేయక తప్పలేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు అక్కడ శత్రువులు. దేశంలో మిత్రులని మోడీ అక్కడ ఎద్దేవా చేసి వచ్చారు. అంతర్గత విబేధాలున్నా బిజెపిని అడ్డుకోవడమనే కేరళ విశిష్టత ఆయనకు నచ్చలేదు. ఇంత విలక్షణమైన రాజకీయ సంస్కృతి మరెక్కడా చూడం. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ ఈ వాస్తవాన్ని గుర్తించి బాధ్యతగా వ్యవహరించే బదులు సిపిఎం, వామపక్షాలను దెబ్బతీయడమే కార్యక్రమంగా పెట్టుకుంది. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వెళ్లి ఎల్‌డిఎఫ్‌పై రాళ్లు విసిరి వచ్చారు. నిజానికి హిమాచల్ ప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌వారి క్రాస్ ఓటింగ్‌తో గెలిచిన బిజెపి ఆ సర్కారును కూలదోయడానికి సర్వసిద్ధంగా వుంది. అదే జరిగితే తర్వాతి లక్ష్యం తెలంగాణ అనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది. ఆ అవకాశం లేదని టి.కాంగ్రెస్ నాయకులు గాంభీర్యం చూపిస్తున్నా ముప్పు వుండనే వుంటుంది. హిమాచల్ గతే ఇక్కడా పడుతుందని బిజెపి ఎంపీలు కె.లక్ష్మణ్, అరవింద్, బండి సంజయ్ వంటి వారు రోజూ బెదిరిస్తున్నారు. అసలు రేవంత్‌నే ఏక్‌నాథ్ షిండేలా అవుతారని అవహేళన చేస్తున్నారు. వీటిపై కాంగ్రెస్ నుంచి నిజానికి రావలసినంత స్పందన, నిరసన లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇక ఎ.పి లోనైతే గత ప్రస్తుత పాలక పార్టీలైన టిడిపి (జనసేన సహితంగా), వైసిపిలు బిజెపి పల్లకీ మోయడానికే పోటీలు పడుతున్నాయి. పోటాపోటీగా వారు జరిపే సభల్లో పరస్పర దూషణలు తప్ప ఎక్కడా బిజెపిపై, మోడీపై పెదవి కదిపే ప్రసక్తి వుండదు. మోడీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యమని పవన్ కళ్యాణ్ మొన్న తాడేపల్లిగూడెం సభలో ప్రకటించేశారు. దేశంలోనూ ప్రత్యేకించి దక్షిణాదిలోనూ మరెక్కడా ఈ విధంగా మూడు పాలక పార్టీలూ బిజెపిని మోసే పరిస్థితి చూడలేం! విచిత్రమేమంటే టిడిపి, జనసేన ఇంతగా లోబడిపోతున్నా తన రాజకీయ మాయాజాలం తేలని బిజెపి పొత్తులపై స్పష్టత ఇవ్వకుండా వారిని తిప్పుకుంటున్నది. ఇది రాసే సమయానికి బిజెపి ఒంటరిగా వెళుతుందని సంకేతాలు వస్తున్నా పొత్తు అవకాశాన్ని తోసిపుచ్చలేము. ఇందుకు ప్రతిగా కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీలు ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రయోజనాలు లౌకికతత్వం వంటివాటిపై ప్రత్యేకంగా కార్యక్రమాలు జరపడం చూస్తున్నాం. దేశంలో ఇతర చోట్ల కూడా వామపక్షాలు గానీ, 'ఇండియా'లో భాగస్వాములుగా వున్న సమాజ్‌వాది, ఆప్, ఆర్‌జెడి వంటి పార్టీలు గానీ చేతులు కలిపి నడిచేందుకే ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజానికి ప్రతిపక్షాలలో పెద్దదైన కాంగ్రెస్ పార్టీయే హిమాచల్ పరిణామాల తర్వాత సర్కారును కాపాడుకోలేక సతమతమవుతున్నది. మొన్న ఓడిపోయిన మధ్యప్రదేశ్‌లోనూ కమల్‌నాథ్ వంటి నాయకులే కమలం పంచన చేరే సూచనలు వదులుతున్నారు. లౌకిక పార్టీలపై వామపక్షాలపై బిజెపి దాడి పెరుగుతున్న సమయంలో కాంగ్రెస్ అంతర్గత బలహీనతలు, అనైక్యత నుంచి బయటపడలేకపోవడం పెద్ద సవాలే. కాంగ్రెస్ లొసుగులు ఆసరా చేసుకుని మోడీ తన దాడినంతటికీ ఆ పార్టీని ముందు పెట్టి ప్రతిపక్ష శిబిరంపై దాడి చేయడం వాస్తవం. ఆ దాడిని ఏకోన్ముఖంగా ఎదుర్కోగల చేవ కూడా కాంగ్రెస్ ప్రదర్శించలేకపోతున్నది. హిమాచల్‌లో సంక్షోభంతో పాటు యు.పి లో ఒక రాజ్యసభ సీటు కోల్పోవడం కూడా కాంగ్రెస్, ఎస్‌పిల నిరుత్సాహానికి కారణమైంది. రాయ్‌బరేలీలో సోనియా తప్పుకోవడం, ప్రియాంక అక్కడకు వస్తారా లేదా రాహుల్ పోటీ చేస్తారా వంటివే పెద్ద ప్రశ్నార్థకాలై కూర్చున్నాయి. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలలో లోపాలు, అవకాశవాదాలు కొన్ని ఆటంకాలుగా వున్నా మొత్తానికి బిజెపిని నిలవరించే అవకాశాలు చాలా వున్నాయనేది వాస్తవమే. బిజెపికి స్వంతంగా 370 స్థానాలు వచ్చే అవకాశమే లేదని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నొక్కి చెప్పడం గమనించదగిన విషయం.



తెలకపల్లి రవి



ఏకపార్టీ వ్యవస్థ ఏర్పాటే ధ్యేయం !

ప్రతిపక్షాలే లక్ష్యం...

> **నేతలు మరిన్ని అవకాశాల కోసమే ఈ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని భావిస్తే అదొక పొరపాటే అవుతుంది. కాంగ్రెస్‌ను మొత్తంగా ధ్వంసం చేయడానికి మరీ ముఖ్యంగా బిజెపికి ప్రధాన ప్రతిపక్షంగా వున్న రాష్ట్రాల్లో నాశనం చేయడానికి, అలాగే యావత్ ప్రతిపక్షాలను బలహీనపరచడానికి ఉద్దేశించబడిన ఫిరాయింపుల పర్వంలో ఇదొక భాగంగా జరుగుతోంది.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీల నుండి ఫిరాయింపులు జరిపేందుకు బిజెపి పూర్తి స్థాయిలో ఆపరేషన్ చేపట్టింది. నితీష్ కుమార్‌కి చెందిన జెడి(యు), జయంత్ చౌదరికి చెందిన ఆర్‌ఎల్‌డిలను బిజెపిలోకి లాక్కున్న తర్వాత, వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, పలువురు నేతలు వరుసగా బిజెపిలోకి ఫిరాయిస్తున్నారు.

కేవలం గత నెల రోజుల కాలంలోనే, అస్సాంలో ఇరువురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు రాష్ట్ర బిజెపి ప్రభుత్వానికి మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. వారిలో ఒకరు అస్సాం కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా వున్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ బిజెపిలోకి ఫిరాయించారు. రాజస్థాన్‌లో, నాలుగుసార్లు ఎంఎల్‌ఎ, కాంగ్రెస్ గిరిజన నేత మహేంద్రజీత్ సింగ్ మాలవీయ అకస్మాత్తుగా బిజెపితో సైద్ధాంతిక అనుబంధాన్ని పెంచుకున్నారు. గుజరాత్‌లో అసెంబ్లీలో కాంగ్రెస్ చీఫ్ విప్‌తో సహా ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు బిజెపిలో చేరారు. పదవీ విరమణ చేస్తున్న రాజ్యసభ ఎంపి, ఐదుసార్లు లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపి, గిరిజన నేత నారన్ రత్వా, ఆయన కుమారుడు వీరిని అనుసరించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో, బిజెపిలోనే ఫిరాయింపుదారులు వున్నారు. ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి చెందిన మరో ఇద్దరు ఎంఎల్‌ఎలతో కలిసి బిజెపిలో చేరారు. బీహార్‌లో, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఆర్‌జెడి ఎంఎల్‌ఎ పాలక పక్షం వైపునకు మళ్లారు. అంతకు ముందు విశ్వాస పరీక్ష సందర్భంగా ముగ్గురు ఆర్‌జెడి ఎంఎల్‌ఎలు పార్టీ ఫిరాయించారు. జార్ఖండ్‌లో ఏకైక కాంగ్రెస్ ఎంపి గీతా కొడా బిజెపిలో చేరారు.

నేతలు మరిన్ని అవకాశాల కోసమే ఈ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని భావిస్తే అదొక పొరపాటే అవుతుంది. కాంగ్రెస్‌ను మొత్తంగా ధ్వంసం చేయడానికి మరీ ముఖ్యంగా బిజెపికి ప్రధాన ప్రతిపక్షంగా వున్న రాష్ట్రాల్లో నాశనం చేయడానికి, అలాగే యావత్ ప్రతిపక్షాలను బలహీనపరచడానికి ఉద్దేశించబడిన ఫిరాయింపుల పర్వంలో ఇదొక భాగంగా జరుగుతోంది.

కాంగ్రెస్, కొంతమంది ప్రతిపక్ష నేతలను బిజెపిలోకి ఫిరాయించేలా, ఆ పార్టీలో చేరేలా బిజెపి ద్వంద్వ ఎత్తుగడలకు పాల్పడుతోంది. ఇందుకోసం బలవంతపు చర్యలను ఉపయోగించడం, రాయితీల ఆశ చూపడం– అంటే బెదిరించడం, ప్రలోభ పెట్టడం రెండూ ప్రయోగిస్తోంది. ఇందులో బెదిరింపు అంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను నేతలకు గురిపెట్టడం, ఇక ప్రలోభపెట్టడమంటే నేతలపై గల అన్ని అవినీతి ఆరోపణల నుండి విముక్తిని ప్రసాదించడం, ఎన్నికల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు ఇవ్వడం, పెద్ద మొత్తంలో ఉదారంగా డబ్బులు ఇవ్వడం వంటివి వున్నాయి. బిజెపిలో చేరడం వల్ల కలిగే లాభాలను కనుగొన్న వారిలో అనేకమంది అవినీతికి సంబంధించిన కేసులను లేదా దర్యాప్తును ఎదుర్కొంటున్న వారే. ఇందుకు అశోక్ చవాన్ ప్రధాన ఉదాహరణ. ఆదర్శ్ గృహ నిర్మాణ కుంభకోణంలో ఆయన నిందితుడుగా వున్నారు. అంతకుముందు, ఎన్‌సిపిలో చీలిక వచ్చి విడిగా పార్టీ ఏర్పాటు చేసిన వారిలో అనేకమంది నాయకులు, బిజెపితో చేతులు కలిపిన వారు అందరూ ఇ.డి చేపట్టిన అనేక కేసుల దర్యాప్తులను ఎదుర్కొంటున్న వారే. ఇతరులకు సంబంధించి, ఇక ఈ ప్రోత్సాహకాలన్నీ కూడా పూర్తిగా బేరసారాలతో కూడినవే. తమకు, తమ కుటుంబ సభ్యులకు మరిన్ని మెరుగైన అవకాశాల కోసమే వారు బిజెపిలో చేరారు.

ఇడి, సిబిఐ వంటి బెదిరింపు, బలవంతపు ఎత్తుగడలకు కూడా లొంగని వారికి జైలు ఊచలు వేచి చూస్తుంటాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా వున్న హేమంత్ సోరెన్ విషయంలో జరిగింది అదే. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు బెదిరింపులు కూడా అవే.

ప్రతిపక్షాన్ని మొత్తంగా నిర్మూలించి, ఏక పార్టీ వ్యవస్థను నెలకొల్పాలన్నదే బిజెపి నాయకత్వ లక్ష్యంగా వుంది. 'అస్సాంలో నిజమైన ప్రతిపక్షమంటూ ఏమీ లేదు' అని అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వా శర్మే స్వయంగా వ్యాఖ్యానించారు. ఎంఎల్‌ఎలందరూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు మద్దతునిచ్చే రాష్ట్రం ఇదే కానుందంటూ ఆయన ప్రగల్భాలు పలికారు.

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌ల్లో ఇటీవల ముగిసిన రాజ్యసభ ఎన్నికల్లో జరిగింది చూస్తే ఇదంతా కూడా ఒక మాస్టర్ ప్లాన్ అని, దాని ప్రకారమే బిజెపి వ్యవహరిస్తోందని స్పష్టమవుతోంది.

ఉత్తరాదిన ఏకైక కాంగ్రెస్ ప్రభుత్వం వున్న హిమాచల్ ప్రదేశ్‌లో 68మంది సభ్యులు గల అసెంబ్లీలో 40మంది కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, 25మంది బిజెపికి చెందినవారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతునిచ్చే ముగ్గురు ఇండిపెండెంట్లు వున్నారు. అయినా కూడా ఇక్కడ బిజెపి అభ్యర్థి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ముగ్గురు ఇండిపెండెంట్లు బిజెపి అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో, అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలో సుఖు ప్రభుత్వం ప్రమాదకరమైన పరిస్థితుల్లో పడింది.

ఉత్తరప్రదేశ్‌లో, 10 సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా, సమాజ్‌వాదీ పార్టీకి అసెంబ్లీలో బలాన్ని బట్టి మూడు సీట్లు గెలుచుకోవచ్చు, కానీ ఎస్‌పికి చెందిన ఏడుగురు ఎంఎల్‌ఎలు పార్టీ ఫిరాయించి బిజెపికి ఓటు వేశారు. వీరిలో ఎస్‌పి చీఫ్ విప్ కూడా వున్నారు. ఆ రకంగా బిజెపి అదనంగా రెండు రాజ్యసభ స్థానాల్లో గెలుపొందింది. హిమాచల్ ప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ మనుగడకు ముప్పుగా కూడా మారింది.

ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి, దాని నాయకత్వానికి తీవ్ర ఆందోళన కలిగించింది. బిజెపి అవినీతికర విన్యాసాలను ఎవరైనా నిరసించవచ్చు, కానీ తన కార్యకర్తల్లో, నేతల్లో ఏం జరుగుతోందో తెలుసుకోలేనంతగా కాంగ్రెస్ ఎలా నిద్రపోతోందన్నది ఇక్కడ ప్రశ్నగా వుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినా పార్టీ విభజించిన ఇల్లుగానే కొనసాగుతోందనేది స్పష్టమైంది.

కమల్‌నాథ్ లైక్స్ ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత దుస్థితి మరింత బాగా అర్థమైంది. సీనియర్ నేత, పైగా మధ్యప్రదేశ్‌లో పార్టీకి సారథ్య బాధ్యతల్లో వున్న వ్యక్తి బాహాటంగానే హిందూత్వ ప్రమాణాలను ప్రశంసించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, బిజెపితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆయన సుముఖత చూపారు. కారణాలేమైనా కానీ అక్కడ పనవ్వలేదు. కాంగ్రెస్ నేతల్లో ఇలాంటి వైఖరి, పరిస్థితి వుంటే, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌కి వ్యతిరేకంగా ధృఢమైన, తీవ్రమైన పోటీ ఎన్నటికీ ఇవ్వలేదు.

బిజెపిని ఎదుర్కొనాలంటే హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సాహసోపేతమైన, నిలకడతో కూడిన పోరాటాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా చేయాల్సి వుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఇదొక అస్తిత్వ పోరాటమని ప్రతిపక్ష పార్టీలు గ్రహించాలి. రాబోయే ఎన్నికల సందర్భంగా మతోన్మాద–కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా, వారి వల్ల ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న ప్రమాదానికి వ్యతిరేకంగా శక్తివంతమైన ప్రచారాన్ని చేపట్టాలి. తద్వారా మాత్రమే ప్రజలను చైతన్యవంతులను చేసి బిజెపిని ఓడించగలుగుతాం.

(ఫిబ్రవరి 28 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

ఒంటిపూట బడులు మేలు

రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. అంతేగాక అనేక ప్రాంతాల్లో వడగాలులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసి, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. రాష్ట్ర వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతేగాక స్కూళ్ళల్లో రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు రెండవ విడత నిర్మాణపు పనులు చేపడుతున్నది. విద్యార్థులు తరగతి గదుల్లో మరమ్మతులు చేస్తుండటం వల్ల ఆరుబయట కూర్చుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల ఎండ తీవ్రతకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం పాఠశాలలకు మార్చి మొదటి వారం నుంచే ఒంటిపూట బడులు నిర్వహించాలి.

- వాసిలి సురేష్

సామాన్యులకు అందని రైల్వే సేవలు

వేల కోట్ల రూపాయలతో వందల రైల్వే స్టేషన్లు ఆధునీకరించి ప్రయాణీకులకు అద్వితీయ సేవలందించేందుకు పూనుకున్నట్లు రైల్వే శాఖ తెలియజేస్తున్నది. అయితే ఇప్పటికే పలు స్టేషన్లు మూసివేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రయాణీకులు పయనించే పలు ప్యాసింజర్ రైళు రద్దు చేశారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్ళలో జనరల్ బోగీలు కేవలం రెండు లేదా మూడు మాత్రమే ఉండటంతో సుదూర ప్రాంతాలకూ నిలబడి, వేలాడుతూ, పాయిఖానా దొడ్లో ముక్కు మూసుకుని గంటల కొద్దీ ప్రయాణించే దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. అరవై ఏళ్ళు నిండిన వృద్ధులకు టికెట్ ధరలో నలబై శాతం కన్సెషన్ రద్దు చేశారు. ఇలా అన్నిరకాలుగా ప్రయాణీకులను దూరం చేస్తూ రైల్వేస్టేషన్లు ఆధునీకరించడం ఎవరికోసం? సామాన్యులకు ఆమడ దూరంలో ఉన్నాయనేది వాస్తవం. పాసింజర్ రైళ్ళు, జనరల్ బోగీల పెంపు, వృద్ధులకు రాయితీ పునరుద్ధరణ తదితర సేవలు పెంచితే ప్రయాణీకులు ఆకర్షితులౌతారు. లేనిపక్షంలో ఆధునీకరించిన స్టేషన్లు బిచ్చగాళ్ళు, కుక్కలు, పందికొక్కులకు ఆవాసాలు కాగలవు.

- యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎంఎస్‌పికి చట్టబద్ధ హామీ, కుల గణన, ఉద్యోగ ఖాళీల భర్తీ

- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులకు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీ, దేశవ్యాప్తంగా కులగణన, ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ ఖాళీల భర్తీ 2024 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రముఖంగా ఉంటాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. చివరి దశలో ఉన్న ముసాయిదా మేనిఫెస్టోపై చర్చించేందుకు కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం నేతృత్వంలోని పార్టీ మేనిఫెస్టో కమిటీ ఈ నెల 4న సమావేశం కానుంది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో న్యాయ్ యాత్ర గత రెండు నెలలుగా ప్రధానంగా ప్రస్తావిస్తున్న యువత, మహిళలు, రైతులు, కార్మికులు, భగీదారీ (భాగస్వామ్యం)లతో కూడిన పంచన్యాయ్ (ఐదు న్యాయ స్తంభాల)పై మేనిఫెస్టో దృష్టి సారిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శనివారం చెప్పారు. దేశవ్యాప్త కుల గణన, వారి సంఖ్యకు అనుగుణంగా హక్కులు కల్పిస్తామని హామీ ఇవ్వడం కాంగ్రెస్ ప్రధాన ప్రణాళికలలో ఒకటిగా ఉండనుంది. అయోధ్యలో రామమందిర ప్రారంభం, సిఎఎ తదితర హిందుత్వ అంశాలకు బిజెపి ప్రాధాన్యత ఇస్తుండగా, కుల గణనపై కాంగ్రెస్ కేంద్రీకరిస్తోంది. మేనిఫెస్టోతో ప్రజత జీవనోపాధి సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది. "ప్రభుత్వ ఖాళీల భర్తీ. కొత్త ఉద్యోగాల కల్పన, మెరుగైన వేతనాలు వంటి వాగ్దానాలు. యువత, కార్మికులకు న్యాయం చేయడంలో భాగంగా ఉంటాయి" అని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.



కేంద్రం నో

- బెంగళూరు ఫిల్మ్ ఫెస్ట్ నుంచి రైతుల నిరసనపై డాక్యుమెంటరీ నిషేధం
- ప్రదర్శితం కాని 'కిసాన్ సత్యాగ్రహ'

న్యూఢిల్లీ : రైతుల పట్ల అనుసరించిన అమానవీయ వైఖరి ప్రపంచానికి తెలియకుండా మోడీ సర్కారు అధికార బలాన్ని వినియోగిస్తోంది. 2020-21 రైతుల నిరసనపై రూపొందించిన 'కిసాన్ సత్యాగ్రహ' డాక్యుమెంటరీని బెంగుళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (బిఐఎఫ్ఎఫ్)లో ప్రదర్శించకుండా నిషేధించింది. "సున్నితమైనది" అనే కారణంతో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆ డాక్యుమెంటరీకి అనుమతి నిరాకరించింది. దీంతో 'కిసాన్ సత్యాగ్రహ' ప్రదర్శన ఆగిపోయింది.

కన్నడ దర్శకుడు కేసరి హరవు దర్శకత్వం వహించిన ఈ డాక్యుమెంటరీ.. మోడీ సర్కారు రూపొందించిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయటానికి రైతులు దాదాపు ఒక సంవత్సరం పాటు ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన ఆందోళనలను వివరిస్తుంది. డాక్యుమెంటరీని బిఐఎఫ్ఎఫ్ 15వ ఎడిషన్‌లో ప్రదర్శించాల్సి ఉన్నది. "ప్రదర్శింపబడే అన్ని సినిమాలకు ఐ అండ్ బి మంత్రిత్వ శాఖ అనుమతినిస్తుంది. అయితే, మంత్రిత్వ శాఖ 'కిసాన్ సత్యాగ్రహం'కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు... డాక్యుమెంటరీలో చిత్రీకరించిన విషయం సున్నితమైన అంశం కాబట్టి దీనిని ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించకుండా నిలిపివేయాలని కేంద్ర అధికారులు మాకు చెప్పారు. సూచనలను అనుసరించి, మేము 'కిసాన్ సత్యాగ్రహ' ప్రదర్శనను ఉపసంహరించు కున్నాము. లేకుంటే శుక్రవారమే స్క్రీనింగ్‌కు షెడ్యూల్ చేసి ఉండాల్సింది" అని కర్ణాటక చలనచిత్ర అకాడమీ రిజిస్ట్రార్ జి. హిమంత్ రాజు తెలిపినట్టు ఒక వార్త సంస్థ పేర్కొన్నది. ఇప్పటి వరకు రైతులపై 86 నిమిషాల నిడివి గల డాక్యుమెంటరీ నాలుగు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలతో సహా కొన్ని ఫోరమ్‌లలో ఆఫ్‌లైన్‌లో ప్రదర్శించబడింది. కిసాన్ సత్యాగ్రహం వైట్ యునికార్న్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2022లో ఉత్తమ భారతీయ డాక్యుమెంటరీ అవార్డును గెలుచుకున్నది. అనటోలియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2022లో ఫైనలిస్ట్‌గా నిలిచింది.

ఈ విజయం గాజాదే!

- బ్రిటన్ ఉప ఎన్నికలో విజేత జార్జి గలోవె వ్యాఖ్య
- లేబర్ పార్టీకి ఎదురు దెబ్బ



పార్టీ కార్యాలయం వద్ద అభివాదం చేస్తున్న బ్రిటన్ ఉప ఎన్నికల విజేత జార్జి గలోవె

లండన్ : గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని గుడ్డిగా సమర్ధిస్తూ వచ్చిన బ్రిటన్ లేబర్ పార్టీకి పార్లమెంటు ఉప ఎన్నికల్లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. లేబర్ పార్టీ ఎంపీ సరల్ టోనీ లాయిడ్ మరణంతో ఖాళీ అయిన రొచ్డాలె నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ అభ్యర్థి జార్జి గాలొవే సంచలనాత్మక విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన బడా వ్యాపారవేత్త డేవిడ్ తులీపై దాదాపు 6వేల ఓట్ల తేడాతో అవలీలగా గెలుపొందారు. మొత్తం పోలైన ఓట్లలో గలోవెకు 40 శాతం ఓట్లు లభించాయి. ఈ ఏడాదిలో బ్రిటన్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఎన్నిక ఫలితం లేబర్ పార్టీకి ఒక గట్టి హెచ్చరికగా పరిశీలకులు బావిస్తున్నారు శనివారం తెల్లవారు జామున ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే గాలొవె తన పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద గుమికూడిన మద్దతుదారులనుద్దేశించి మాట్లాడుతూ, "గాజాలో ఇజ్రాయిల్ సాగించే మారణకాండను ప్రోత్సహిస్తూ మీరు పోషించిన పాత్రకు తగిన మూల్యం చెల్లించారు." అని లేబర్ నేత సర్ కెయిర్ స్టార్మర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "తరతరాలుగా లక్షలాదిమంది ప్రజల విశ్వాసాన్ని, ఆదరాభిమానాలను చూరగొన్న లేబర్ పార్టీ మీరు తీసుకున్న వైఖరి వల్ల ఈనాడు మొత్తంగా ఆ నమ్మకాన్ని కోల్పోతోంది.." అని అన్నారు.

పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన రెండూ పత్తా లేకుండా పోయాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత లేబర్ పార్టీకి ఇది అతి పెద్ద క్షీణత అని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా లేబర్ పార్టీకి మరింత నష్టం కలగకుండా ఉండాలంటే గాజాలో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ అవసరాన్ని బలంగా నొక్కి చెప్పాల్సిన అవసరముందని ఆ పార్టీలో ఒక సెక్షన్ బలంగా వాదిస్తోంది.

జార్జి గాలొవేను గెలిపించడం ద్వారా ప్రజలు పాలస్తీని యన్ల హక్కులకు మరోసారి తమ తిరుగులేని మద్దతు ప్రకటించినట్లైందని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి రాబ్ గ్రిఫిత్ వ్యాఖ్యానించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగించే ఊచకోత రాజకీయాలకు బ్రిటన్ సామ్రాజ్యవాదం మద్దతునివ్వడాన్ని ప్రజలు తిరస్కరించారు." అని పేర్కొన్నారు. రొచ్డాలె ప్రజలు తమ అభిప్రాయాలను ఈ ఫలితం ద్వారా స్పష్టం చేశారని ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యుఎ) వ్యాఖ్యానించింది. 'అయిందేదో అయింది. ఇకనైనా సునాక్, స్టార్మర్‌లు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి వుంది.' అని స్పష్టం చేసింది.

రవాణా సమ్మెతో స్తంభించిన జర్మనీ



- మెరుగైన పని పరిస్థితుల కోసం ఉద్యమించిన కార్మికులు

ఫ్రాంక్‌ఫర్ట్ : రవాణా సమ్మెతో జర్మనీలో పలు ప్రాంతాలు స్తంభించాయి. స్థానిక బస్సులు, సబ్‌వే రైళ్ళు, ట్రామ్‌లు అనీ నిలిచిపోయాయి. మరింత మెరుగైన పని పరిస్థితులు కావాలని డిమాండ్ చేస్తూ కార్మికులు వారం రోజులుగా సమ్మెచేస్తున్నారు. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ క్లైమేట్ యాక్టివిస్ట్ గ్రూపు వీరి పోరాటానికి సంఘీభావం తెలిపింది. రాత్రివేళల్లో విధుల నిర్వహణకుగాను అదనపు నష్టపరిహారం ఇవ్వాలని, పని వారాన్ని మరింత తగ్గించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రైలు డ్రైవర్ల యూనియన్, జర్మన్ ట్రెయిన్ డ్రైవర్స్ (జిడిఎల్), దేశంలోనే ప్రధాన రైల్వే అపరేటర్ అయిన డాయిష్ బాన్‌కు మధ్య సుదీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఎలాంటి వేతన కోత లేకుండా పని వారాన్ని 35గంటలకు కుదించాలని వారు కోరుతున్నారు. దీనిపై గురువారం జరిగిన చర్చల్లో డాయిష్ బాన్ వాకౌట్ చేసింది. సోమవారం తమ తదుపరి కార్యాచరణను తెలియచేస్తామని జిడిఎల్ తెలిపింది.

త్రిపుర ఆదివాసీ సమస్యలపై త్రైపాక్షిక ఒప్పందం

అగర్తలా : త్రిపుర రాష్ట్ర జనాభాలో 33శాతంగా వున్న ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దానిపై భారత ప్రభుత్వం, త్రిపుర ప్రభుత్వం, త్రిపుర ఆదివాసీ ప్రగతిశీల ప్రాంతీయ కూటమి (తిప్రా)లు న్యూఢిల్లీలో శనివారం సంతకాలు చేశాయి. ఆదివాసీల చరిత్ర, భూ హక్కులు, రాజకీయ హక్కులు, ఆర్థికాభివృద్ధి, గుర్తింపు, సంస్కృతి, భాష వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంయుక్త వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఈ ఒప్పందం పేర్కొంటోంది. నిర్దిష్ట సమయంలో పరిష్కారం లభ్యమయ్యేవరకు ఎలాంటి నిరసనలు తలపెట్టబోమంటూ తిప్రా కూడా అంగీకరించింది. అయితే సంయుక్త వర్కింగ్ కమిటీ ఏర్పాటుకు నిర్దిష్ట కాల పరిమితిని పేర్కొనలేదు. వచ్చే వారంలోగా ఏర్పాటవుతుందని సీనియర్ తిప్రా నేతల ఒకరు వెల్లడించారు. ఈ కమిటీలో కేంద్ర హోం శాఖ, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం, తిప్రా, పాలక సంకీర్ణంలో బిజెపి భాగస్వామి ఐపిఎఫ్‌టి ప్రతినిధులు వుంటారని చెప్పారు.

శాంతియుతంగా కవాతు...

- నేడు రైతుల కార్యాచరణ ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

శాంతియుతంగా ఢిల్లీకి కవాతు చేస్తామని, లేదంటే సరిహద్దు ప్రాంతాల్లో ధర్నాలు బలోపేతం చేస్తామని రైతులు స్పష్టం చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు 'ఢిల్లీ చలో' నిరసన కొనసాగుతుందని రైతులు శనివారం పునరుద్ఘాటించారు. ఫిబ్రవరి 21న ఖనౌరీ సరిహద్దులో హర్యానా పోలీసులు పెల్లెట్ గన్స్, భాష్పవాయు గోళాలు ప్రయోగించడంతో మరణించిన యువ రైతు శుభకరన్ సింగ్‌కు సంతాపం తెలుపుతూ ఆదివారం నిర్వహించే సభ అనంతరం తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. "సరిహద్దులలో హర్యానా భద్రతా బలగాలు అడ్డుకోకపోతే శాంతియుత పద్ధతిలో ఢిల్లీకి మార్చ్ చేస్తాం. లేకపోతే, మేము ఇప్పటికే ఉన్న సరిహద్దుల వద్ద ఆందోళనను బలోపేతం చేస్తాం. పంజాబ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా మరిన్ని ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తాం" అని కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సభ్యుడు రమణదీప్ సింగ్ మాన్ చెప్పారు. కెఎంఎం కోఆర్డినేటర్ సర్వన్ సింగ్ పంధేర్, బికెయు (క్రాంతికారి) ప్రధాన కార్యదర్శి బల్దేవ్ సింగ్ జిరా, బికెయు-ఏక్తా (ఆజాద్) అధ్యక్షుడు జస్వీందర్ సింగ్ లాంగోవాల్ మాట్లాడుతూ "శాంతియుతంగా వెళ్లేందుకు అనుమతిస్తే ఢిల్లీకి పాదయాత్ర చేస్తాం. లేకుంటే సరిహద్దుల్లో ధర్నాను మరింత ఉధృతం చేస్తాం" అని అన్నారు.

19వ రోజు కొనసాగిన రైతు ఆందోళన

అన్ని పంటలకు సి2 ప్లస్ 50 శాతంతో కూడిన ఎంఎస్‌పి హామీతో పంట సేకరణ చట్టం తీసుకురావాలని, రైతులకు రుణ రుణమాఫీ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు చేపట్టిన ఆందోళన శనివారానికి 19వ రోజుకు చేరుకుంది. హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభూ, ఖానౌరీ ప్రాంతాల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది.

ముంబయి బాంబు పేలుళ్ల ప్రధాన సూత్రధారి మృతి

ముంబై : ముంబై బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన సూత్రధారి, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అజామ్ ఛీమా పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌లో గుండెపోటుతో మరణించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన అంత్యక్రియలు ఫైసలాబాద్‌లోని మల్కన్‌వాలాలో పూర్తయినట్లు సమాచారం. 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠా 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు.




మీ కోసం

జుట్టుకు వారానికోసారి పెరుగు పట్టిస్తే శిరోజాలకు తగినంత తేమ, పోషణ లభిస్తాయి.

జీవన సౌరభం

ఒక మేధావి శ్రమ ఫలితం కొన్ని లక్షల మంది సామాన్య ప్రజలకు ప్రయోజనంగా మారుతుంది.

గొప్ప వ్యక్తి



అవంతి రాజ్యాన్ని పరిపాలిస్తున్న మహేంద్ర వర్మ తన పుట్టిన రోజు సందర్భంగా రాజ్యాభివృద్ధిలో పాలుపంచుకున్న ఒక గొప్ప వ్యక్తికి సన్మానం చేయాలని నిర్ణయించుకున్నారు. అదే విషయాన్ని సభాముఖంగా ప్రకటిస్తూ, అటువంటి ఉన్నత వ్యక్తిని ఎంపిక చేసే అధికారం మంత్రి సుభద్రుడికి అప్పగించారు.

ఆ ప్రకటన విని సభలో కొంతమంది ఆ సన్మానం తమకే జరుగుతుందని అనుకున్నారు. కోశాధికారి కమలుడు మంత్రిని కలిసి, 'మంత్రివర్యా! కోశాధికారిగా రాజ్యానికి ఎనలేని సేవలు చేస్తున్నాను. రాజ్యంలో ఆర్థికపరమైన ఒడిదుడుకులు లేకుండా నా వంతు పాత్ర వహిస్తున్నాను. కావున సన్మానం అందుకునే భాగ్యం నాకు కలిగించండి' అని కోరాడు. మహామంత్రి నవ్వి 'అలాగే చూద్దాం' అన్నాడు.

తర్వాత రోజు ఆస్థాన మహా పండితుడు భీమశర్మ మంత్రిని కలిసి, 'మంత్రి వర్యా! నా పాండిత్య మహత్యంతో మన అవంతి రాజకీయ కీర్తి ప్రతిష్టలు నలుమూలల వ్యాపింపజేశాను. నా సేవలు గుర్తించి సన్మానం పొందే భాగ్యం కలిగించండి' అని వేడుకున్నాడు. ఇలా ప్రతిరోజూ ఆస్థానంలో ఉన్న కొంతమంది మహామంత్రిని కలిసి సన్మానానికి తమ పేరును సిఫార్సు చేయమని కోరుకున్నారు.


సన్మాన గ్రహీతను ప్రకటించే మహారాజు జన్మదినం రానే వచ్చింది. మహామంత్రిని కలిసిన చాలామంది తమ పేరే మంత్రి చెబుతారని ఆసక్తిగా ఎదురుచూశారు. మహామంత్రి సుభద్రుడు లేచి, సామాన్య జనులు కూర్చునే చోటుకు వెళ్లి ఒక వృద్ధుడిని తన చేయి ఆసరాతో ముందుకు నడిపిస్తూ రాజు గారి దగ్గరకు తెచ్చారు. 'ఇతనే మీరు ఈరోజు సన్మానించబోయే గొప్ప వ్యక్తి' అని రాజుకు పరిచయం చేశాడు. సభలో ఉన్న వారందరూ ఆశ్చర్యపోయారు. 'ఏమిటి ఇతని గొప్పతనం' అని రాజు అడిగారు.

'మహారాజా! ఇతని పేరు సదాశివ.. మన రాజ్యానికి చివరన ఓ కుటీరంలో నివసిస్తున్నాడు. వ్యవసాయం చేస్తూ వచ్చే దిగుబడిలో కొంత పొదుపు చేసి తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పుతున్నాడు. వారి దగ్గర విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న అనేకమంది మన రాజ్యంలో కొలువులు చేస్తూ రాజ్యాభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. నేను కూడా సదాశివ గురువు గారి శిష్యుడినే. నిరంతరం మన రాజ్యానికి రక్షణ కవచంలా నిలబడే మన సైన్యాధికారి కూడా అతని శిష్యులే' అని గురువు గారి గురించి చెప్పారు.

సభ అంతా చప్పట్లతో మారు మ్రోగిపోయింది. సింహాసనం దిగి మహారాజు సదాశివను ఆలింగనం చేసుకున్నారు. 'మానవ వనరుల అభివృద్ధిలో గురువే కీలకం. నైతిక విలువలు బోధిస్తూ, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులు రాజ్య ప్రగతికి రథసారథులు. అటువంటి గురువును ఈరోజు నా జన్మదినం సందర్భంగా సత్కరించుకోవడం చాలా ఆనందంగా ఉంది' అని చెప్పి సన్మాన ఏర్పాట్లు చేయమని చెప్పారు.

- మొర్రి గోపి,
కవిటి, శ్రీకాకుళం జిల్లా, 88978 82202.

నేను గీసిన బొమ్మ





బోర శ్యామలరావు,
2వ తరగతి, ఎంపిపిఎస్
గొంపవానిపాలెం,
కే.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ స్పర్శానందం.. సప్తవర్ణ సోయగం!



పిల్లలను ఏదైనా కొత్త ప్రదేశానికి తీసుకెళ్లినప్పుడు అక్కడ ఏదైనా కళారూపం కనిపించగానే వారు తమ చేతికి పని చెబుతారు. ఆ రూపాన్ని కళ్లతో చూడడం కంటే చేతులతో స్పర్శించి అనుభూతి చెందడానికే ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇది చాలా సందర్భాల్లో ఎంతోమంది పెద్దలకు ఎదురయ్యే అనుభవం. అంటే చూపు కంటే స్పర్శ ద్వారానే కళారూపాలను ఆస్వాదించడానికి పిల్లలు ఇష్టపడతారు. ఇప్పుడు మనం చెప్పకుంటున్న పిల్లలు కూడా అలాంటివారే. అయితే వీరంతా చూపు ఉన్న పిల్లలు కారు. పుట్టుకతోనో, అనారోగ్య సమస్యలతోనో, ఏదేని కారణంగానో చూపును కోల్పోయిన అంధ విద్యార్థులు. రాజస్థాన్‌లో 1968 నుంచి నిర్వహిస్తున్న 'నేత్రహీన్ కల్యాణ్ సంఘ్' విద్యార్థుల గురించే ఇప్పుడు మనం చెప్పకుంటోంది.

'నేత్రహీన్..' సంస్థను నిర్వహిస్తున్న జెఎన్ భార్గవ్ కూడా చూపులేని వ్యక్తే. ఆ సంస్థలో దశాబ్దాల తరబడి వేలాదిమంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. చదువొక్కటే కాదు, వారి మానసిక, శారీరక సామర్థ్యాలను అంచనా వేసి ఆ దిశగా ప్రోత్సహించడంలో కూడా సంస్థ ముందుంటోంది. ఇప్పుడు ఆ పాఠశాలలోనే నూతన ప్రాజెక్టు 'స్పర్శ్'ను ప్రవేశపెట్టారు. 'ఎస్‌టి-ఆర్ట్' స్వచ్ఛంద సంస్థ ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఏషియన్ పెయింట్స్ భాగస్వామ్యం కూడా తోడైంది.

'స్పర్శ్'లో ఏం చేస్తున్నారు?

సంగీతం, ఆటలు, పాటలు, వాయిద్యం వంటి వివిధ కళల్లో ఇక్కడి పిల్లలు రాణించేలా శిక్షణ ఇవ్వడం సంస్థ ప్రత్యేకత. 'స్పర్శ్' రంగప్రవేశం తరువాత ఈ పిల్లలను కళారంగంలోకి కూడా అడుగులు వేసేలా చేస్తున్నారు. చిత్రకళ, వస్త్రాలపై రంగులద్దడం, చేతితో తయారు చేసే కళారూపాలు ఇలా ఒకటేమిటి.. కళల మాధ్యమం ద్వారా కళా ప్రపంచాన్ని సరికొత్త మార్గంలో అన్వేషించేలా ఈ






విద్యార్థులను 'స్పర్శ్' ప్రేరేపిస్తోంది. ఇందులో ప్రదర్శించిన కళారూపాలను ప్రతి విద్యార్థి తమ స్పర్శ ద్వారా ఆద్యంతం అనుభూతి చెందడం వెనుక, డిజైనర్ సిద్ధాంత్ సాహ్ కృషి ఎంతో ఉంది. ఆయన బ్రెయిలీ లిపిలో ఈ కళారూపాలను డిజైన్ చేశారు. రంగులద్దే పరికరాలను విద్యార్థుల చేతికందించి, ఆ కళారూపాలకు రంగులు వేయించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'నేత్రహీన్..' విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బృందాలు బృందాలుగా కూర్చొని రోలర్లు, పెన్సిళ్లు, పేపర్లు, దుస్తులు, కుంచెలతో అందమైన కళారూపాలు చిత్రించారు.

నిలువెత్తు గోడపై ...

'నేత్ర హీన్ కళ్యాణ్ సంఘ్' పాఠశాలలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఏడడుగుల గోడ ఉంది. ఇప్పుడు దానిపై విద్యార్థులు వేసిన కళారూపాలను పొందుపరిచారు. ఆర్ట్ మ్యూజియంగా నిర్వహిస్తున్న అందులో పొందుపరిచిన ఆ కళాఖండాలను విద్యార్థులంతా చేతితో తడుతూ ఆస్వాదిస్తున్నారు. ఆ రూపాలను స్పర్శిస్తున్నప్పుడు పిల్లల ముఖాల్లో ఎన్ని ఆనందపు వర్ణాలు వెల్లివిరుస్తాయో మాటల్లో చెప్పలేము. ఈ మొత్తం కార్యక్రమానికి వీడియో రూపంలో పొందుపరిచి సంస్థ నిర్వాహకులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. లక్షలాది మంది ఆ వీడియోను వీక్షించి, 'స్పర్శ్' కృషికి అభినందనలు చెబుతున్నారు. ఒక్కోసారి ప్రయత్నం చిన్నదే కావొచ్చు.. కానీ అది చూపించే ప్రభావం ఎంత పెద్దగా ఉంటుందో చెప్పటానికి ఈ సంఘటన గొప్ప ఉదాహరణ.



పచ్చి మామిడి.. బహుళ ప్రయోజనకారి

పచ్చి మామిడిలో కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె, విటమిన్ బి6, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అవి అసిడిటీ, అజీర్ణం, మలబద్ధకం, ఉదయం పూట బడలిక వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. వాంతులు, వికారం వంటి సమస్యలను అదుపు చేస్తాయి. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. దంత సంరక్షణిగా దోహదపడుతుంది. సోడియం క్లోరైడ్, ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి ఇస్తుంది. పచ్చి మామిడికాయపై తోలును మొత్తగా నూరి మజ్జిగలో కలిపి రోజుకి రెండు లేదా మూడు సార్లు తాగితే విరోచనాలు, పైల్స్ తగ్గిపోతాయి. మామిడి ముక్కలలో తేనె, మిరియాల పొడి కలిపి తింటే కాలేయం చక్కగా పనిచేస్తుంది. మేగిఫెరిన్ కొలెస్ట్రాల్, ట్రై గ్లిజరాయిడ్స్, ఫేటి యాసిడ్ స్థాయిని నియంత్రించటంలో దోహదం చేస్తుంది. ఫెనోల్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్‌లు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. శరీరంలో వచ్చే వాపులను తగ్గిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. చర్మ సంరక్షణకు కూడా దోహదపడతాయి. పింపుల్స్, మచ్చలు, కంటి కింద చారలు, కళ్లు గుంటలు పడటం, రకరకాల సమస్యలను తగ్గిస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో చిన్న రసాలు విరివిగా లభిస్తున్నాయి. పచ్చి మామిడిని పప్పులో విరివిగా వాడుకోవచ్చు. కూరల్లో కూడా వేస్తే మంచి టేస్ట్ వస్తుంది. అందుకే పిల్లల నుంచి పెద్దల వరకూ వీటిని తినటానికి బాగా ఇష్టపడతారు. ఈ సీజన్‌లో లభించి మామిడిని తిని ఆరోగ్యంగా ఉండండి.

గాజువాక అసెంబ్లీ, విశాఖ పార్లమెంట్ స్థానాల్లో పోటీ

- నేటి 'ఉక్కు' మహా పాదయాత్రకు మద్దతు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు, ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రానున్న ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ, విశాఖ పార్లమెంట్ స్థానాల్లో సిపిఎం పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం తెలిపారు. ఈ మేరకు పార్టీ జిల్లా కమిటీ పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు.

శనివారం ఆయన సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మలతో కలిసి మాట్లాడారు. రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని బిజెపి ప్రభుత్వం నాశనం చేస్తోందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్న బిజెపిని, టిడిపి కూటమి పార్టీలను, ప్రభుత్వ భూములను మింగేస్తున్న వైసిపిని ఓడించాలని ప్రజలను కోరారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న సిపిఎంకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖపట్నం కార్మికవర్గ ప్రాంతమన్నారు. ప్రభుత్వోద్యోగుల సమస్యలపైనా, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపైనా సిపిఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికుల పోరాటాలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి, వైసిపి, టిడిపి ప్రభుత్వాలు ప్రజలపై ఎలా భారాలు మోపుతూ వచ్చాయో వివరించారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే ఈ ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోగలమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 1,115 రోజులుగా విశాఖ ప్రజలు, కార్మిక, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నాయని తెలిపారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఈ నెల 3న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు తలపెట్టిన ఉక్కు మహా పాదయాత్ర ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. దీనికి సిపిఎం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రయివేటీకరణ విధానాలను వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు.

హర్యానాలో ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



హర్యానా ప్రభుత్వ నిర్బంధంపై ఆశాల ఆగ్రహం

- ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి విజయవంతం

చండీగఢ్ : రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి, అణచివేత చర్యలను నిరసిస్తూ హర్యానా అంతటా ఆశా వర్కర్లు కదం తొక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల కార్యాలయాలను శనివారం చుట్టుముట్టారు. 73 రోజుల సమ్మె అనంతరం చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని సిఐటియు అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ ఫిబ్రవరి 29న పంచకులలో భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ఆశా వర్కర్లను అరెస్ట్ చేసి, నాయకులను నిర్బంధించారు. ఈ దమనకాండను వ్యతిరేకిస్తూ శనివారం చేపట్టిన ఆందోళనలు విజయవంతమయ్యాయి.

ఈ ఆందోళనలకు సిపిఎం మద్దతు తెలిపింది. ఆశా వర్కర్లతో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్రప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.

ఫిషరీస్, వ్యవసాయంపై కుదరని ఏకాభిప్రాయం

అబుదాబి : ఆహార భద్రతకు సంబంధించిన కీలకమైన వ్యవసాయం, ఫిషరీస్ వంటి అంశాలపై ఎలాంటి ఒప్పందం లేకుండానే డబ్ల్యుటిఓ 13వ మంత్రిత్వ స్థాయి చర్చలు ముగిశాయి. ఆహార నిల్వలపై ప్రభుత్వ నియంత్రణ ఉండరాదని సంపన్న దేశాలు వాదించగా, వర్ధమాన దేశాలు దీనిని వ్యతిరేకించాయి. దీనిపై ముమ్మర చర్చలు జరిగినప్పటికీ ఏకాభిప్రాయాన్ని సాధించడంలో సమావేశం విఫలమైంది. అలాగే మత్స్య పరిశ్రమ సబ్సిడీలపై కోత పెట్టాలన్న ధనిక దేశాల డిమాండ్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. మితిమీరిన చేపల వేటకు దారితీస్తున్న సమస్యలకు ఇది ఎలాంటి పరిష్కారం చూపలేకపోయింది. మరో రెండేళ్లపాటు ఇ కామర్స్ వాణిజ్యంపై దిగుమతి సుంకాలపై మారటోరియాన్ని పొడిగించేందుకు సభ్య దేశాలు అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 26న ప్రారంభమైన ఈ సమావేశాలు 29తో ముగియాల్సి వుంది, అయితే, ఫిషరీస్, వ్యవసాయం వంటి అంశాల్లో ఎలాగైనా ఒప్పందం కుదుర్చుకోవాలన్న దాంతో చర్చలను ఒక రోజు పొడిగించారు. దీంతో శుక్రవారం కూడా చర్చలు కొనసాగాయి. అయినా ఫలితం లేకపోయింది. ఆహార భద్రతకు సంబంధించిన అంశంపై ఉమ్మడి ప్రాతిపదికను కుదుర్చుకోవడంలో సభ్యదేశాలు విఫలమయ్యాయి. పేద రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను పరిరక్షణకు సంబంధించిన అంశాలపై జి-33 గ్రూపుతో కలసి భారత్ చేసిన వాదనను సంపన్న దేశాలు పట్టించుకోలేదు. వర్ధమాన దేశాల ఎగుమతులపై ఎలాంటి ఆంక్షలు వుండరాదని బ్రెజిల్ వాదించింది. ప్రపంచ వ్యాపితంగా 80 కోట్ల మంది ప్రజల జీవనోపాధికి సంబంధించిన ఆహార భద్రత సమస్యకు శాశ్విత పరిష్కారం చూపడంలో 166 దేశాలతో కూడిన డబ్ల్యుటివో విఫలమైంది.

స్పెయిన్ మహిళపై గ్యాంగ్‌రేప్..!

రాంచీ: జార్ఖండ్‌లో దారుణం చోటు చేసుకుంది. భర్తతో కలిసి జార్ఖండ్ పర్యటనకు వచ్చిన స్పెయిన్ దేశానికి చెందిన మహిళపై 10 మంది దుండగులు గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. దుమ్కా ఎస్‌పి మాట్లాడుతూ.. టూరిస్టు వీసా మీద భారత్‌కు స్పానిష్ జంట వచ్చింది. జార్ఖండ్‌లోని దుమ్కాలో మోటార్ బైక్‌పై పర్యటిస్తూ పలు ప్రదేశాలు సందర్శిస్తున్నారు. ఇక్కడి కుంజి గ్రామంలో టెంట్లు వేసుకుని విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు దుండగులు బాధితురాలిపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది. మొత్తం ఆసియా ఖండంలో టూర్‌కు ప్లాన్ చేసిన స్పానిష్ జంట తొలుత పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో టూర్ పూర్తిచేసుకుని, ఇక్కడికి వచ్చారు. ఇక్కడి నుంచి నేపాల్ వెళ్లాలని భావిస్తుండగా, ఈ దారుణం జరిగింది. ఇప్పటికే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామన్నారు.

టాప్‌లోకి ముంబయి

- బెంగళూరుపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు
- మహిళల ప్రిమియర్ లీగ్

బెంగళూరు: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) రెండో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ టాప్‌లోకి దూసుకొచ్చింది. నాలుగు మ్యాచ్‌లు ముగిసేసరికి ముంబయి మూడు విజయాలు, ఒక ఓటమితో 6పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళలతో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబయి మహిళలు ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 131పరుగులు చేయగా.. ఛేదనలో ముంబయి జట్టు 15.1 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 133పరుగులు చేసి గెలిచింది. ముంబయి ఓపెనర్లు యాస్టికా భాటియా(31), మాథ్యూస్(26) తొలి వికెట్‌కు 3.5ఓవర్లలో 45పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనా.. కెప్టెన్ స్కీవర్ బ్రంట్(27)కి తోడు అమెలియా కెర్ర్(40నాటౌట్)మ్యాచ్‌ను విజయతీరాలకు చేర్చారు. చివర్లో బ్రంట్ ఔటైనా.. పూజ వస్త్రాకర్‌తో కలిసి కెర్ర్ మరో 4.5ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించింది. బెంగళూరు బౌలర్లు డివైన్, వారేహామ్, శ్రేయాంకకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గిన బెంగళూరుకు శుభారంభం దక్కలేదు. ముంబయి బౌలర్లు బ్రంట్, వాంగ్, ఇషిక్, వస్త్రాకర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో



అమెలియా కెర్ర్ 40(నాటౌట్)

బెంగళూరు మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 131 పరుగులే చేసింది. కెప్టెన్ మంధాన(9), సోఫీ డివైన్(9), మేఘన(11), రీచా(7) స్వల్ప స్కోర్లకే పెవీలియన్‌కు చేరడం బెంగళూరు జట్టు 42 పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ఎలీసా పెర్రీ(44నాటౌట్), మెలినెక్స్(12) కలిసి 5వ వికెట్‌కు 29పరుగులు జతచేశారు. ఆ తర్వాత మోలినెక్స్ ఔటైనా.. వారేహామ్(27; 20బంతుల్లో 3ఫోర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్ తోడైంది. చివరి ఓవర్ వరకు పెర్రీ క్రీజ్‌లో నిలిచి బెంగళూరు జట్టు గౌరవప్రద స్కోర్ చేసేందుకు దోహదపడింది. ముంబయి బౌలర్లు బ్రంత్, పూజ వస్త్రాకర్‌కు రెండేసి, వాంగ్, ఇషికాకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు..

బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)స్కీవర్ బ్రంట్ (బి)వాంగ్ 9, సోఫీ డివైన్ (ఎల్‌బి) శిఖా ఇషిక్ 9, మేఘన (సి)కీర్తన (బి)స్కీవర్ బ్రంట్ 11, ఎలీసా పెర్రీ (నాటౌట్) 44, రీచా ఘోష్ (సి)సజన (బి)వస్త్రాకర్ 7, సోఫీ మోలినెక్స్ (బి)పూజ వస్త్రాకర్ 12, వారేహామ్ (సి)కెర్ర్ (బి)బ్రంట్ 27, శ్రేయాంక (నాటౌట్) 7, అదనం 7. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 131పరుగులు. **వికెట్ల పతనం :** 1/14, 2/31, 3/33, 4/42, 5/71, 6/123 **బౌలింగ్:** స్కీవర్ బ్రంట్ 4-0-27-2, మాథ్యూస్ 4-0-29-0, వాంగ్ 3-0-20-1, శిఖా ఇషికా 2-0-9-1, అమెలియా కెర్ర్ 3-0-20-0, పూజ వస్త్రాకర్ 3-0-14-2, కీర్తన 1-0-11-0

ముంబయి మహిళల ఇన్నింగ్స్: యాస్టికా భాటియా (సి)రీచా ఘోష్ (బి)డివైన్ 31, మాథ్యూస్ (సి)స్మృతి మంధాన (బి)శ్రేయాంక 26, స్కీవర్ బ్రంట్ (సి)మోలినెక్స్ (బి)వారేహామ్ 27, అమెలియా కెర్ర్ (నాటౌట్) 40, పూజ వస్త్రాకర్ (నాటౌట్) 8, అదనం 1. (15.1ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 133పరుగులు. **వికెట్ల పతనం:** 1/45, 2/69, 3/118 **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-25-0, మోలినెక్స్ 3-0-26-0, సోఫీ డివైన్ 2-0-16-1, వారేహామ్ 2.1-0-18-1, శ్రేయాంక పాటిల్ 2-0-15-1, సిమ్రన్ 1-0-11-0, ఎలెసా పెర్రి 2-0-10-0, శోభన 1-0-12-0

తమిళనాడు 146ఆలౌట్

రంజీట్రోఫీ సెమీఫైనల్

ముంబయి: రంజీట్రోఫీ సెమీఫైనల్లో ముంబయి జట్టు పట్టు బిగిస్తోంది. శనివారం నుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ సెమీస్‌లో తమిళనాడు జట్టును తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 146పరుగులకే పరిమితం చేసిన ముంబయి.. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించి తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లు శార్దూల్ ఠాకూర్, ముషీర్ ఖాన్, తనుష్ కొటియన్ రెండేసి వికెట్లు తమిళనాడును కట్టడి చేయడంలో సఫలమయ్యారు. తమిళనాడు జట్టులో విజయ్ శంకర్(44), సుందర్(43) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఇక విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతున్న మరో సెమీస్‌లో విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 170పరుగులకే కుప్పకూలింది. మధ్యప్రదేశ్ బౌలర్లు ఆవేశ్ ఖాన్ నాలుగు, కుల్వంత్, వెంకటేశ్ అయ్యర్ రెండేసి వికెట్లతో రాణించి విదర్భను కట్టడి చేశారు. కరణ్ నాయర్(63) అర్ధసెంచరీకి తోడు ఓపెనర్ అధర్వ తైడే(39) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోయి 47పరుగులు చేసింది.



ఆవేశ్ ఖాన్ (4/49)




చెన్నై ఆటగాళ్ల ప్రాక్టీస్ షురూ..

చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె) కెప్టెన్ ఎమ్మెస్ ధోనీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. నెట్స్‌లో ధోనీతోపాటు చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్లు కొంతమంది ప్రాక్టీస్ చేసిన సిఎస్‌కె ఫ్రాంచైజీ శనివారం ట్విటర్(ఎక్స్)లో పోస్ట్ చేసింది.

న్యూజిలాండ్ లక్ష్యం 369 పరుగులు

ఫిలిఫ్స్ స్పిన్ మాయ ● ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్



ఫిలిఫ్స్ (5వికెట్లు)

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిఫ్స్ బంతితో మెరిసాడు. గ్లెన్ ఫిలిఫ్స్ ఐదు వికెట్లకు తోడు హెన్రీ మూడు, కెప్టెన్ సౌథీ రెండు వికెట్లతో రాణించడంతో ఆస్ట్రేలియా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 164పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు భారీ ఆధిక్యత లభించడంతో న్యూజిలాండ్ జట్టు ముందు 369పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో న్యూజిలాండ్ రచిన్ రవీంద్ర(56నాటౌట్) అర్థ సెంచరీకి తోడు డారిల్ మిచెల్(12 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ విజయానికి 258 పరుగులు చేయాల్సి ఉండగా.. మరో ఏడు వికెట్లు కూలిస్తే ఆసీస్ గెలవనుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 383పరుగులు చేయగా.. న్యూజిలాండ్ 179 పరుగులకే కుప్పకూలింది. దాంతో ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 203 పరుగుల ఆధిక్యం లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68